సాయి సూర్య
తెలుగు దిన పత్రిక
దినపత్రికలో
అన్ని రకాల ప్రకటనలు
అడ్వర్టైజ్మెంట్స్ మరియు
వార్తల కోసం
సంప్రదించండి: 9100900931

సాయి సూర్య
తెలుగు దిన పత్రిక

సంపుటి : 01 సంచిక : 02 ఎడిటర్ పాలగోని రాజేష్ 21 మంగళవారం జనవరి 2025 పేజీలు 8 వేల 4



# రాహుల్‌గాంధీకి ఊరట

## -క్రిమినల్ కేసు విచారణను నిలిపివేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ,జనవరి20( కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి భారీ ఊరట లభించింది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా, బీజేపీపై చేసిన వ్యాఖ్యలకు గానూ దాఖలైన పరువు నష్టం కేసులో ఆయనపై క్రిమినల్ విచారణను సుప్రీంకోర్టు నిలిపివేసింది. 2018 లో బెంగళూరులో జరిగిన విలేకరుల సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై రాహుల్ గాంధీ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. అమిత్ షా ఓ హత్య కేసులో నిందితుడని రాహుల్ ఆరోపించారు. ఆ ఘటనలో రాహుల్‌పై క్రిమినల్ డిఫమేషన్ కేసు బుక్ చేశారు. 2



# దావోస్‌లో ఇద్దరు తెలుగు సీఎంల భేటీ

హైదరాబాద్,జనవరి20 :
స్విట్జర్లాండ్ లోని దావోస్ లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్తుకు తెలుగు రాష్ట్రాల నుంచి ఇద్దరు సీఎంలు మంత్రులు హాజరయ్యారు. మంత్రులతో కలిసి దావోస్ పర్యటనకు వెళ్లిన సమయంలో అరుదైన కలయిక జరిగింది. జ్యూరిచ్ చేరుకున్న ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రులు, అధికారుల బృందం.. అదే ఎయిర్ పోర్టులో అప్పటికే అక్కడ ఉన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. తెలుగు రాష్ట్రాల ఇద్దరు సీఎంలు, మంత్రులు ఒకే చోట కలిసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. చిత్రలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేష్, శ్రీధర్ బాబు, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహననాయుడు ఉన్నారు. మంత్రి శ్రీధర్ బాబు భుజంపై చేతులేసి.. షేక్ హ్యాండ్ ఇస్తున్నారు సీఎం చంద్రబాబు. ఉదయం జ్యూరిచ్ ఎయిర్ పోర్టులో వీళ్ల మీటింగ్ జరిగింది.తెలుగు రాష్ట్రాలకు పెట్టుబడులపై లక్ష్యంగా.. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, అధికారుల బృందం దావోస్ లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరైంది.

# సీఎం రేవంత్ మాటలు కోటలు..
# చేతలు గల్లీ కూడా దాటవు

## -రాష్ట్రంలో కనీసం జీతాలు కూడా ఇవ్వలేని స్థితి : హరీశ్‌రావు

హైదరాబాద్,జనవరి20
సీఎం రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటుతాయని కానీ చేతలు మాత్రం గల్లీ కూడా దాటదని, ప్రతి నెలా మొదటి తారీఖున ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామన్న సీఎం, మంత్రుల మాటలు నేతి బీరకాయలో నెయ్యిచందంగా మారాయని అనేకసార్లు రుజువయ్యాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకే కాదు.. 2



ట్రెయినీ వైద్యురాలిపై హత్యాచారం కేసు

# దోషి సంజయ్ రాయ్‌కి జీవిత ఖైదు

-బాధితురాలి కుటుంబానికి 17 లక్షల పరిహారం

-కోల్‌కతాలోని సిల్దా కోర్టు సంచలన తీర్పు



2

# విద్యార్థి దశ నుంచి రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

-విద్యార్థులకు మంత్రి పొన్నం సూచన



# కక్షసాధింపు రాజకీయాలు సరికాదు

2

-కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు





# ఏడాదిలో ఏం చేశావ్ రేవంత్ రెడ్డి?

## -మరోమారు అసహనం వ్యక్తం చేసిన కెటిఆర్

హైదరాబాద్,జనవరి20(
ఈ ఏడాది కాలంలో రూ. లక్షా 40 వేల కోట్లు అప్పు చేసి ఏం పీకినవ్ రేవంత్ రెడ్డి..? అంటూ మరోమారు కెటిర్ తన అసహన భాషలో మాట్లాడారు. ఏడాదిలో ఏంచేశారని అడగడానికి ఆయన తన వల్గర్ లాంగ్వేజీలో ప్రశ్నించారు. ఒక కొత్త ఇటుక పెట్టినవా, ఒక కొత్త పైప్ లైన్ వేసినావా, ఒక కాలువ తవ్వినవా, ఒక కార్మికుడికి లాభం తెచ్చవా, ఒక ఆడబిడ్డకు రూ.2500 ఇచ్చావా, తులం బంగారం ఇచ్చవా..? ఏం పీకినవ్ సంవత్సరంలో అని రేవంత్ రెడ్డిని కేటీఆర్ నిలదీశారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ కార్మిక విభాగం క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కేటీఆర్ ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చాలా హామీలు ఇచ్చింది.. హామీల అమలు కోసం నిలదీస్తే మీకు జీతాలు ఇచ్చుడే ఎక్కువ అని ఉద్యోగులను బెదిరిస్తున్నారు. కేసీఆర్ అప్పులపాలు చేసిపోయారు అని చెబుతుండ్రు. ఈ తప్పుడు ప్రచారాన్ని, పనికిమాలిన వెధవ ప్రచారాన్ని తప్పికొట్టాల్సిన బాధ్యత మనపైనే ఉంది 2

# గవర్నర్ ప్రతిభా పురస్కారాలు-2024' ప్రకటన

హైదరాబాద్,జనవరి20 :
'గవర్నర్ ప్రతిభా పురస్కారాలు-2024' అవార్డులను తెలంగాణ గవర్నర్ కార్యాలయం ప్రకటించింది. ఈ అవార్డులకు ఎంపికైన 8 మంది జాబితాను వెల్లడించింది. వివిధ రంగాల్లో సేవలందించిన వ్యక్తులు, సంస్థలకు ఈ అవార్డులను ప్రదానం చేస్తారు. ఈ నెల 26న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ అవార్డులను అందించనున్నారు. ఈ మేరకు గవర్నర్ కార్యాలయ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్ ప్రకటన విడుదల చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నాలుగు రంగాలకు చెందిన వారికి ఏటా పురస్కారాలు ఇవ్వాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నిర్ణయించారు. పర్యావరణ పరిరక్షణ, దివ్యాంగుల సంక్షేమం, క్రీడలు, సాంస్కృతిక విభాగాల్లో గత ఐదేళ్లుగా ఉత్తమసేవలు అందిస్తున్న వారికి గవర్నర్ ప్రతిభా పురస్కారాలు ఇవ్వనున్నారు. సంస్థలు, వ్యక్తులకు వేర్వేరు కేటగిరీల్లో ఈ అవార్డులు ఉంటాయి. అవార్డు కింద రూ.2 లక్షలు, జ్ఞాపిక ఇవ్వనున్నారు. అవార్డుకు ఎంపికైన వారిలో ..దుశర్ల సత్యనారాయణ, అరికపూడి రఘు, పారా ఒలింపిక్ విజేత జీవాంజి దీప్తి, ప్రొఫెసర్ ఎం.పాండురంగారావు, పి.బి.కృష్ణభారతికి సంయుక్తంగా, ధ్రువాంశు ఆర్గనైజేషన్, ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి, ఆదిత్య మెహతా ఫౌండేషన్, సంస్కృతి ఫౌండేషన్ ఉన్నాయి.




# ఇందిరమ్మ ఇళ్ల కోసం మరో అవకాశం

## -నేటి నుంచి గ్రామసభల్లో దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్,జనవరి20
కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు మరో అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది రాష్ట్ర ప్రభుత్వం. జనవరి 21 నుంచి జరిగే గ్రామ సభల్లో వీటి కోసం అప్లికేషన్లు స్వీకరించాలని కలెక్టర్లను ఆదేశించారు సీఎస్ శాంతి కుమారి. దీనికి సంబంధించి గైడ్స్ లైన్స్ తో సర్క్యులర్ పంపించారు. గ్రామ సభల్లో కొత్త రేషన్ కార్డులతో పాటు ఇప్పటికే ఉన్న కార్డుల్లో పేర్లు చేర్చడానికి దరఖాస్తులు స్వీకరించాలి. ఒకే కుటుంబం నుంచి వేరే పడ్తున్న కుటుంబాలకు కొత్త కార్డులు ఇచ్చేందుకు అప్లికేషన్లు తీసుకోవాలి. కుటుంబ పెద్దతో పాటు ఇతర కుటుంబ సభ్యుల వివరాలు, వారి ఆధార్ కార్డులు, కులం, మొబైల్ నంబర్, చిరునామా వంటి వివరాలను తీసుకోవాలని గైడ్ లైన్స్ లో స్పష్టం చేశారు.

# ట్రెయినీ వైద్యురాలిపై హత్యాచారం కేసు

కోల్‌కతా,జనవరి20 :
కోల్‌కతా ఆర్‌జీకర్ మెడికల్ కాలేజీలో ట్రెయినీ వైద్యురాలిపై హత్యాచారం కేసుకు సంబంధించి దోషి సంజయ్ రాయ్ కి కోల్‌కతాలోని సిల్దా కోర్టు జీవిత ఖైదు శిక్ష వేస్తూ తీర్పు నిచ్చింది. ఈ కేసులో ఇప్పటికే విచారణను పూర్తి చేసిన కోల్‌కతాలోని సీల్దా కోర్టు.. గత శనివారం సంజయ్ రాయ్ దోషి అని తేల్చింది. ఈ కేసులో సోమవారం తీర్పును వెలువరిస్తామని చెప్పిన కోర్టు.. తాజాగా అతడికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పును ఇచ్చింది. ఇక సంజయ్ రాయ్ కి ఏం శిక్ష విధిస్తారని దేశం మొత్తం తీవ్ర ఉత్కంఠగా ఎదురుచూస్తుండగా.. అతడికి జీవిత ఖైదు విధించారు. మరోవైపు ఇంత దారుణంగా హత్యాచారం చేసిన సంజయ్ రాయ్ కి ఉరిశిక్ష విధించాలనే డిమాండ్లు వెల్లువెత్తాయి. కేసులో తీర్పు ఇవ్వడానికి ముందుగా సీల్దా కోర్టు జడ్జి జస్టిస్ అనిర్బన్ దాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు అరుదైనది అని తాను భావించడం లేదని.. అందుకే చనిపోయే వరకు జైలు శిక్ష అనుభవించాలని తీర్పును ఇస్తున్నట్లు ప్రకటించారు. ఇదే సమయంలో ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన బాధితురాలి తల్లిదండ్రులకు రూ. 17 లక్షల పరిహారం చెల్లించాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. 2023 ఆగస్ట్ 9వ తేదీ రాత్రి కోల్‌కతాలోని ఆర్జీకర్ హాస్పిటల్ సెమినార్ రూమ్‌లో నిద్రిస్తున్న జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, ఆపై హత్య జరగడం దేశంలో తీవ్ర సంచలనాన్ని రేపింది. మొదట కోల్‌కతా పోలీసులు ఈ కేసు విచారణ ప్రారంభించగా.. పశ్చిమ బెంగాల్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతో సీబీఐ రంగంలోకి దిగింది. ఈ నేపథ్యంలోనే స్పెషల్ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసిన సీబీఐ.. ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ పేరును మాత్రమే అందులో చేర్చింది. అయితే ఈ ఘటనలో సామూహిక అత్యాచారం విషయాన్ని ఛార్జిషీట్‌లో పేర్కొనలేదు. ఆర్జీకర్ మెడికల్ ఆస్పత్రి ఆవరణలోని సీసీటీవీలో నమోదైన దృశ్యాల ఆధారంగా సంజయ్ రాయ్ ని గతేడాది ఆగస్ట్ 10వ తేదీన కోల్‌కతా పోలీసులు అరెస్ట్ చేశారు. ఇదే కేసులో అరెస్ట్ అయిన ఆర్జీకర్ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, తాలా పోలీస్ స్టేషన్ మాజీ ఆఫీసర్ ఇంఛార్జ్ అభిజిత్ మండల్‌లకు ఇప్పటికే బెయిల్ లభించింది. ఈ ఘటనలో సాక్ష్యాలు తారుమారు చేశారనే ఆరోపణలపై వారు అరెస్టు కాగా.. అరెస్ట్ తర్వాత 90 రోజుల్లో పోలీసులు, సీబీఐ ఛార్జ్‌షీట్గ్ ÷ల్ చేయకపోవడంతో వారికి బెయిల్ వచ్చింది. జంజర్రాయ్‌కు జీవిత ఖైదు శిక్ష విధించింది. అతడు మరణించే వరకు జైల్లోనే ఉంచాలని కోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. అలాగే సంజయ్‌రాయ్‌కు రూ.50 వేల జరిమానా సైతం కోర్టు విధించింది. ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేసింది. అందులోభాగంగా మొత్తం120 మంది సాక్షులను సీబీఐ విచారించింది. దీంతో భారత న్యాయసంహిత చట్టంలోని సెక్షన్లు 64, 66,103/1 కింద సంజయ్‌కు జీవిత ఖైదు విధించింది. బాధితురాలి కుటుంబానికి న్యాయం జరగాలంటూ దేశవ్యాప్తంగా వైద్యులంతా ఆందోళనకు దిగారు. ఇక పశ్చిమ బెంగాల్ వైద్యులు అయితే.. తమ ఆందోళనలను మరింత ఉధృతం చేశారు. ఆ క్రమంలో వైద్య సేవలు సైతం నిలిచిపోయాయి. దీంతో వారితో చర్చలు జరిపేందుకు ప్రభుత్వం సిద్దమైంది. కానీ వైద్యులు.. తమ డిమాండ్లను మమతా బెనర్జీ ముందు ఉంచారు. కానీ వాటిలో కొన్నింటిని మాత్రమే ఆమె ఒప్పుకున్నారు. అనంతరం ప్రభుత్వం దిగి వచ్చి.. వైద్యులతో చర్చలు జరిపింది. అందుకు న్యాయం చేస్తామని.. అందుకు కొంత గడువు కోరింది. దీంతో వైద్యులు సానుకూలంగా స్పందించారు. కానీ ఇచ్చిన హామీలు ప్రభుత్వం నెరవేర్చక పోవడంతో.. వైద్యులు మళ్లీ ఆందోళన బాట పట్టారు. మరోవైపు అత్యవసర సేవలకు ఎటువంటి అటంకం కలిగించమని వైద్యులు ప్రభుత్వానికి హామీ ఇచ్చారు. ఇక ఈ హత్యాచార ఘటనపై ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి సూపరింటెండెంట్ సందీప్ ఘోష్ వెంటనే స్పందించారు. ఈ హత్యాచార ఘటనను ఆయన ఖండించారు. మృతురాలు తన కుమార్తెతో సమానమన్నారు. ఈ తరహా ఘటనలు భవిష్యత్తులో జరగకూడదని ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. ఆ కొద్ది రోజులకే ఆయన ఆసుపత్రి సూపరింటెండెంట్ పదవికి రాజీనామా చేశారు. అయితే ఆ వెంటనే ఆయన్ని మరో మెడికల్ కాలేజీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా నియమించింది. క ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఉన్న సమయంలో సందీప్ ఘోష్ పై పలు అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో కోర్టు జోక్యం చేసుకొని.. ఆయనను విధుల నుంచి తప్పించాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం విదితమే. ఇక ఇదే తనను బలి పశువును చేశారంటూ నిందితుడు సంజయ్ రాయ్.. కోర్టుకు విన్నవించుకొన్నాడు. అంతేకాదు.. విధులకు హాజరైన ట్రెయినీ వైద్యురాలు.. రాత్రి 11.00 గంటల సమయంలో సెమినార్ హాల్‌లో విశ్రాంతి తీసుకొనేందుకు వెళ్లింది. ఆ ఉదయానికి ఆమె హత్యాచారానికి గురై విగత జీవిగా మారింది. అయితే సెమినార్ హాల్‌లో సీసీ టీవీ కెమెరాలు లేకపోవడం గమనార్హం.

# దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధియే నా ప్రధాన లక్ష్యం!







దేవరకొండ ప్రతినిధి:-
ప్రతి ఆవాసము నుండి మండల కేంద్రానికి సీసీ రోడ్డు %ు%బీటీ రోడ్లు!ఎమ్మెల్యే బాలు నాయక్. చింతపల్లి మండల పరిధిలోని మాల్ గోడకొండ్ల %ఱ% నగర్ గ్రామంలో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై,సీసీ రోడ్డు నిర్మాణ పనులను శంకుస్థాపన చేసిన దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధియే తన ప్రధాన లక్ష్యమని అన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే పేదలకు సేవ చేయాలనే సంకల్పంతో ప్రతి గ్రామం నుండి మండల కేంద్రానికి సీసీ రోడ్డు %ు% బీటీ రోడ్లు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. తాను శాసన సభ్యునిగా గెలిచిన అనతి కాలంలోనే దేవరకొండ నియోజకవర్గంలో అన్ని మండలాన్ని అభివృద్ధి చేసేందుకు తాను శాయశక్తుల కృషి చేస్తున్నానని పేర్కొన్నారు.అదేవిధంగా అన్ని గ్రామాలలో మౌలిక వసతులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే జరుగుతుందని, అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలవాలని కోరారు.అనంతరం మదనపురం గ్రామ పరిధిలోని శ్రీ లక్ష్మి నరసింహా స్వామి దేవాలయం నూతన పాలక వర్గ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని,పాలక వర్గ చైర్మన్ మరియు సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి,శ్రీ లక్ష్మి నరసింహా స్వామి వారిని దర్శించుకొని, వేద పండితుల చేత ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవ రెడ్డి, మాజీ ఎంపీపీలు భవాని పవన్ కుమార్, రవి నాయక్,మండల పార్టీ అధ్యక్షులు అంగిరేకుల నాగభూషణం,మాజి జడ్పీటీసీలు హరి నాయక్, జంగడి నర్సింహా,మాస మంజుల భాస్కర్,వైస్ ఎంపీపీ యాది గౌడ్, %ూౌజం% చైర్మన్ వెంకటయ్య,మండల నాయకులు దోతి రెడ్డి,నర్షి రెడ్డి,శ్రీనివాస్ యాదవ్,కొండల్ యాదవ్,మాజి సర్పంచులు ముచ్చర్ల యాదగిరి,రవీందర్ గౌడ్,మాజీ ఎంపీటీసీ వెంకట్ నర్సింహా రెడ్డి,ప్రజా ప్రతినిధులు, మండల ముఖ్య నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన సంఘం అధ్యక్షులు,పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు

# పేదలకు రేషన్ పండగ ....!

## -15 ఏళ్ల తర్వాత.. కొత్తగా రేషన్ కార్డులు ఇచ్చేందుకు జిల్లా యంత్రాంగం రెడీ. ...!

నారాయణ పేట,
దాదాపుగా 15 ఏళ్ల తర్వాత.. కొత్తగా రేషన్ కార్డులు ఇచ్చేందుకు ఉమ్మడి పాలమూరు జిల్లా అధికార యంత్రాంగం ముమ్మరం గా వివరాల సేకరణలో నిమగ్నం అయ్యారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయిన రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ జరగకపోవడంతో ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలు కొన్ని సందర్భాలలో ఇబ్బందులకు గురయ్యారు. అప్పుడు. ఇప్పుడు అంటూ గత పాలకులు కాలయాపన చేయడం మినహా కొత్తగా రేషన్ కార్డులు ఇవ్వలేదు. గత 20 సంవత్సరాలుగా కుటుంబాలలో అనేక విభజనలు జరగడం.. రకరకాల అవసరాలకు రేషన్ కార్డు ప్రాతిపదిక కావడం.. వల్ల వాళ్ళ కుటుంబాలు ఇబ్బందులకు గురయ్యాయి. గతంలో పలుమార్లు.. రేషన్ కార్డులు ఇస్తామని చెప్పడంతో చాలామంది దరఖాస్తు చేసుకున్నారు. కానీ, ఆ దరఖాస్తులు అన్ని మూలకు పడిపోయాయే తప్ప.. ఒక్కరికి కొత్తగా రేషన్ కార్డు వచ్చిన దాఖలాలు లేవు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం




కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు ఆగమేఘాలపై ఏర్పాట్లు చేస్తోంది.

**అర్హులందరికీ రేషన్ కార్డులు..**

కొత్తగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ రేషన్ కార్డులు ఇచ్చేందుకు ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా అధికారులు సన్నద్ధం అవుతున్నారు. ఇటీవల జరిగిన కుటుంబ సర్వే, ఆన్ లైన్ వచ్చిన దరఖాస్తుల వివరాలను అధికారులు ముమ్మరంగా సేకరిస్తున్నారు. ఈ దరఖాస్తులలో అర్హుల జాబితాను ప్రకటించి.. ఇంకా ఎవరికైనా కార్డులు రాకుంటే ఆయా తేదీలలో నిర్వహించే గ్రామ సభలలో దరఖాస్తులు స్వీకరించి కొత్త రేషన్ కార్డులను కేటాయిస్తారు. ఈ ప్రక్రియను నిరంతరం కొనసాగించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని అధికారులు చెబుతున్నారు.

# రాహుల్‌గాంధీకి ఊరట

రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ కార్యకర్త నవీన్ ఝా పరువునష్టం కేసు దాఖలు చేశారు. దీనిపై ట్రయల్ కోర్టు విచారణ జరిపింది. విచారణ సందర్భంగా వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలన్న రాహుల్ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. దీంతో రాహుల్.. జార?ండ్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి జార?ండ్ కోర్టు నిరాకరించింది. దీంతో రాహుల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. క్రిమినల్ పరువునష్టం కేసుకు సంబంధించి ట్రయల్ కోర్టులో తనపై విచారణను రద్దు చేయాలని క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన దేశ అత్యున్నత న్యాయస్థానం.. ట్రయల్ కోర్టులో ఈ కేసు విచారణపై స్టే విధించింది. ఈ మేరకు జార్ఖండ్ ప్రభుత్వానికి, బీజేపీ నేత నవీన్ ఝాకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా సమాధానాలు ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది.

# సీఎం రేవంత్ మాటలు కోటలు.. చేతలు గల్లీ కూడా దాటవు

మహిళల హక్కులను కాపాడే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మహిళా కమిషన్ సభ్యులకు గత సంవత్సర కాలం నుంచి రేవంత్ రెడ్డి ప్రభుత్వం జీతాలు ఇవ్వడం లేదని తాజాగా నా దృష్టికి వచ్చింది అని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో మహిళా కమిషన్‌కు రూ. 2 కోట్ల 42 లక్షలు కేటాయించినప్పటికీ విడుదల చేసింది రూ. 20 లక్షలకు మించి లేదు. న్యాయమూర్తులతో సమానంగా వ్యవహరించబడే మహిళా కమిషన్ సభ్యులకే జీతాలు చెల్లించలేక పోతే ఈ ప్రభుత్వం సామాన్య మహిళల హక్కులను ఏ విధంగా కాపాడుతుంది..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. వెంటనే మహిళా కమిషన్ సభ్యుల పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని, ఇక నుంచి మొదటి తారీఖునే మహిళా కమిషన్ సభ్యులకు జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరుతున్నానని హరీశ్‌రావు తెలిపారు.

# ఏడాదిలో ఏం చేశావ్ రేవంత్ రెడ్డి?

వాళ్లు మాట్లాడే మాటలు పచ్చి బక్వాస్ మాటలు, బోగస్ మాటలు. ఎలా అంటే.. 2014లో రాష్ట్రం ఏర్పడినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మనకు అప్పజెప్పారు. మన రాష్ట్రం మీద ఉన్న అప్పు ఆనాడురూ. 72 వేల కోట్లు. తలసరి ఆదాయం రూ. లక్షా 14 వేలు. రూ. 369 కోట్లు రెవెన్యూ మిగులు ఉండే. మనం దిగిపోయినాడు.. తలసరి ఆదాయం రూ. 3 లక్షల 56 వేలకు తీసుకుపోయిండు కేసీఆర్. రెవెన్యూ మిగులు రూ. 5,944 కోట్లతో
కాంగ్రెస్‌కు అప్పజెప్పాం. కేసీఆర్ సంపదను పెంచిండు. పాతబాకీలు కట్టుకుంటూ.. అన్ని సమస్యలను పరిష్కరించుకుంటూ.. చేసిన అప్పు మొత్తం 4 లక్షల 17 వేల కోట్లు. ఇది అప్పు కాదు పెట్టుబడి. అనేక ఇరిగేషన్ ప్రాజెక్టులను కట్టిండు.. కాళేశ్వరం, పాలమూర రంగారెడ్డి, సీతారామ, దామరచర్ల విద్యుత్ కేంద్రం, మెడికల్ కాలేజీలు, రైతు వేదికలు నిర్మించి సంపదను సృష్టించిండు. కేసీఆర్ మన భవిష్యత్ కోసం పెట్టుబడి పెట్టిండు అని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే హామీలన్నీ అమలు చేస్తామని భట్టి విక్రమార్కతో పాటు అందరూ మాట్లాడారు. కానీ చేసిందేమీ లేదు. రిటైర్ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తలేరు. డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. పీఆర్సీకి దిక్కు లేదు. ఎప్పుడైనా మనం ఆస్తులు, అప్పులు చూడాలి. ఒక్క ఏడాదిలో రేవంత్ రెడ్డి ఒక లక్షా 40 వేల కోట్ల అప్పు చేసిండు. కేసీఆరేమో ఏడాదికి రూ. 40 వేల కోట్లు అప్పు చేసి అభివృద్ధి కోసం ఖర్చు పెట్టిండు. కానీ రేవంత్ రెడ్డి చేసిన లక్షా 40 వేల కోట్ల అప్పుతో.. కొత్త ఇటుక పెట్టావా.. కాల్వ తవ్వినావా.. రైతుబంధు పెంచావా.. 2500 ఇచ్చావా.. తులం బంగారం ఇచ్చావా.. స్కూటీ ఇచ్చావా.. మరి ఏం పీకినవ్ వన్ ఇయర్‌లో.. మరి లక్షా 40 వేల కోట్లు ఎక్కడ పోయాయి రేవంత్ రెడ్డి..? కేసీఆర్ సాగునీరు తెచ్చిండు, మంచినీరు మంచిగా చేసిండు. రోడ్లు బాగు చేసిండు. సంక్షేమం చేసిండు. కార్మికులను కర్షకులను మంచిగా చూసుకుండు. ఒక్కటి మాత్రం రేవంత్ చేసిండు.. ఢిల్లీకి మూటలు మాత్రం జోరుగా మోసిండు.. వేల వేల కోట్లు పంపి కుర్చీని కాపాడుకుంటున్నాడు అని కేటీఆర్ ఆరోపించారు.

# విద్యార్థి దశ నుంచి రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

హైదరాబాద్,జనవరి20
: రోడ్డు ప్రమాదాల నివారణ విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలని విద్యార్థులకు కు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ నాచారంలోని డీపీఎస్ స్కూల్లో సోమవారం చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ ప్రారంభించారు. విద్యార్థులు రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్ నిబంధనలను తెలుసుకునేలాగా ట్రాఫిక్ అవేర్నెస్ చిల్డ్రన్ పార్క్ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి హాజరై మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రసంగించారు. విద్యార్థి దశలోనే ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించేందుకు ట్రాఫిక్ అవేర్నెస్ పార్కులు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. గతంలో రోడ్డు భద్రత అవగాహనపై వారోత్సవాలు ఉండేవని, ఇప్పుడు వాటి స్థానంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు తీసుకొచ్చామన్నారు. రవాణా శాఖలో కొత్తగా స్క్రాప్ పాలసీ, ఈవీ పాలసీ తీసుకొచ్చామని పేర్కొన్నారు. విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్ పాటించి.. మీ తల్లిదండ్రులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్రంలో పొల్యూషన్ కంట్రోల్ చేయడానికి స్క్రాప్ పాలసీ తెచ్చామని చెప్పారు. రోడ్ సేఫ్టీపై విద్యార్థి దశలోనే ట్రాఫిక్ అవగాహన కల్పించేందుకు పాఠ్య పుస్తకంలో ట్రాఫిక్ అవేర్నెస్?పై ఒక పాఠంగా చేర్చేందుకు ప్రణాళికలు చేస్తున్నామని పేర్కొన్నారు. స్కూల్?లో ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ ఏర్పాటుకు సహకరించిన డీపీస్ స్కూల్ యాజమాన్యానికి ఈ సందర్భంగా మంత్రి ధన్యవాదాలు తెలిపారు.

# కక్షసాధింపు రాజకీయాలు సరికాదు

హైదరాబాద్,జనవరి20(ఆర్ఎన్ఎ): కక్ష సాధింపు రాజకీయాలకు తాను వ్యతిరేకం అని మాజీఎమ్మెల్యే జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాజకీయ పరిణామాలపై కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రివైంజ్ పాలిటిక్స్‌పై జగ్గారెడ్డి మీడియాతో చిట్‌చాట్ చేశారు. అయినా రివైంజ్ పాలిటిక్స్ ఏ పార్టీకి మంచిది కాదని సూచించారు. అలాంటి రాజకీయాలు చేసే వాళ్లు అధికారం పోయాక బాధ పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య.. రివైంజ్ పాలిటిక్స్ చేయలేదన్నారు. ఎవరైనా తనకు నష్టం చేసినా.. తానెవ్వరికీ నష్టం చేయను అని జగ్గారెడ్డి చెప్పుకొచ్చారు. కాకపోతే రాజకీయ యుద్ధం మాత్రం చేస్తామని పేర్కొన్నారు. ఏ రాజకీయ పార్టీ నాయకుడైనా? డబ్బులు తీసుకోకుండా రాజకీయం చేస్తున్నట్లుగా ఎవరైనా ఒప్పుకుంటారా..?, తనతో సహా పైసలు ముట్టుకోకుండా రాజకీయం చేయని నాయకుడెవరూ ఉండరని జగ్గారెడ్డి చెప్పుకొచ్చారు.

# సంపాదకీయం

## దావోస్ పర్యటనలతో సాధించేదేమిటి ?

సోమవారం 20-1-2025

దావోస్‌లో ప్రపంచ పెట్టుబడుల సదస్సుకు ఇరు తెలుగు రాష్ట్రాల సిఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడులు వెళ్లారు. పెట్టుబడులే లక్ష్యంగా వీరు అడుగులు వేస్తున్నారు. హైదరాబాద్‌కు ఉన్న బ్రాండ్‌తో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇది ఆయనకు రెండో పర్యటనగా కలసివస్తుందేమో చూడాలి. చంద్రబాబుకు ప్రపంచంలో సొంత బ్రాండ్ ఇమేజ్ ఉంది. అమరావతి కొత్త రాజధానిగా అవతరించినందున ఆయనకు సానుకూలత కాగలదు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే.. సింగపూర్‌లా రాష్ట్రాలను అభివృద్ధి చేసేందుకు స్థానికంగా ఉన్న యువతకు ప్రోత్సాహం ఇవ్వాల్సి ఉంటుంది. స్థానిక వనరులు, స్థానిక యువతను ప్రోత్సహిస్తే ఆదాయవనరులు కూడా పెరగగలవు.

కానీ మేక్ ఇన్ ఇండియా అంటున్న ప్రధాని కూడా పెద్ద ఎత్తున ఈ రకమైన ప్రోత్సాహం ఇవ్వడం లేదు. దేశీయంగా యువతకు ఉపాధి కల్పించడానికి బ్యాంకులను ప్రోత్సహించాలి. విరివిగా రుణాలు ఇవ్వాలి. వ్యవసాయం, వ్యవసాయాధిరత పరిశ్రమలు, కోళ్లు, పశువులు, గొర్లు, మేకల పెంపకం వంటి వాటికి అవసరమైతే వడ్డీరహిత రుణాలను ఇవ్వగలగాలి. యువత విదేశాలవైపు చూడకుండా ఉండాలంటే ఇలాంటి స్వయం ఉపాధి రంగాలను ప్రోత్సహించాల్సి ఉంటుంది. విదేశీ కంపెనీలను, పెట్టుబడులను ఆహ్వానించి పెద్ద ఎత్తున ఏదో చేయాలన్న ఆలోచన కూడా సరికాదు. ప్రభుత్వ రంగాన్ని, ఉద్యోగులను కుదించడం, సంక్షేమాన్ని వదిలేసి యూజర్ ఛార్జీలు వసూలు చేయడం ఇలాంటి వాటిని కొత్తగా పాలసీలు, విజన్ పేరుతో అమలు చేసేందుకు ఎపిలో కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. రెగ్యులేటరీ కమిషన్లు, ప్రైవేటీకరణకు వీలుగా ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేయబోతు న్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వ పాలనలో అన్నిటిలోనూ ప్రపంచబ్యాంకు విధానాలు గోచరిస్తున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. స్వర్ణాంధ్ర విజన్ 2047, వివిధ రంగాలపై తీసుకొచ్చిన సుమారు 22 పాలసీల్లో గతంలో ప్రపంచబ్యాంకు ఏదైతే చెప్పిందో వాటిని మళ్లీ వేర్వేరు రూపాల్లో తిరిగి తెస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే అవి ఎలా వున్నా.. స్థానికంగా ఉన్న వనరులతో స్థానిక యువతను ప్రోత్సహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి. తక్కువ పెట్టుబడులతో పెద్ద మొత్తంలో ఉపాధికి అవకాశాలను అన్వేషించాలి. విదేశీ పెట్టుబడులు అనగానే ముఖ్యంగా విద్యుత్, నీటిని వ్యాపారం చేయడం, అడిగిన వారికి భూములు అప్పగించడం, పట్టణ ప్రాంతాల్లో పెద్దపెద్ద వ్యాపార సంస్థలకు అనువుగా అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని సవరించడం, వ్యవసాయంలో యాంత్రీకరణ పెంచడం, ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్యను తగ్గించడం, విదేశీ వ్యాపార సంస్థలకు ఎటువంటి అడ్డంకులూ లేకుండా చేయడం వంటి అంశాలు తునమీదకు వస్తున్నాయి. మరీ ముఖ్యంగా వ్యవసాయ భూములను పారిశ్రామిక ప్రాంతాలుగా మార్చడం, ఆహార పంటల స్థానంలో వాణిజ్య పంటలు పెంచడం, ఆహార ఉత్పత్తులను తగ్గించడం ఇవన్నీ కూడా ఆందోళనకర అంశాలు మారుతున్నాయి. ప్రధానంగా వ్యవసాయ భూములను బలవంతంగా లాక్కుని కార్పోరేట్లకు కట్టబెడు తున్నారు. ఇలాంటి పరిస్థితి పోవాలి. కొత్తగా తీసుకొచ్చే పరిశ్రమలు, పారిశ్రామిక పాలసీల్లో లక్షల మందికి ఉపాధి కల్పన ఉంటుందని పేర్కొంటున్నారు. కానీ ఎక్కడా అలాంటిదేమీ కనిపించడం లేదు. విదేశీ పెట్టుబడులకు దాసోహమంటూ ఇక్కడి వనరులను దోచిపెడుతున్న పాలకులు దేశీయంగా యువత ముందుకు వస్తే మాత్రం..ఓ పైసా వడ్డీకూడా తగ్గించడం లేదు. ఉచిత విద్యుత్ ఇవ్వరు. భూమలు ఇవ్వరు. నీరు ఇవ్వరు. దీనిని బట్టి ప్రపంచీకరణ ప్రభావంతో దేశంలో విదేశీయుల పెత్తనం పెరగిపోవడం ఖాయం. అదే సమయంలో ఉత్పాదకతలో సాంకేతికతను పెంచాల్సి ఉంది. ఆధునీకరణ పేరిట ఇప్పటికే ఉన్న

ఉపాధి పోతుంటే కొత్త ఉపాధి వస్తుందని మభ్యపెట్టడం తప్ప మరొకటి కాదు. వ్యవసాయంలో యాంత్రీకరణ, పారిశ్రామిక ఆధునీకరణ అవసరమే. అయితే అది ఉన్న ఉపాధిని దెబ్బతీయకుండా చూసుకోవాలి. సంస్కరణల్లో భాగంగా ఉద్యోగాలను ప్రైవేటుపరం చేయడం ద్వారా ఖర్చును తగ్గించుకోవాలని కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాలు చూస్తున్నాయి. తమపై భారం లేకుండా చూడాలని చూస్తున్నారు. జీతాలు, పెన్షన్లు తగ్గించుకోవాలన్న క్రమంలో ప్రైవేట్ పెట్టుబడులకు పెద్దపీట వేస్తున్నారు. దావోస్ లాంటి సదస్సులు ఇందుకు వేదికగా మారుతున్నాయి. ప్రభుత్వం ప్రైవేటు ఇండిస్ట్రియల్ పార్కులు తెచ్చి రైతులు నేరుగా వారికి భూములు అప్పగించొచ్చనీ ప్రకటించడమే కాకుండా రాయితీలూ ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నది. గతంలో తీసుకొచ్చిన సరళీకరణ విధానాల్లో పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా భూములు కేటాయింపులు జరపాలనేది కీలకమైన షరతు. దీన్ని ఇప్పుడు పాలసీ రూపంలో ముందుకు తీసుకొచ్చారు. అయితే ఇదంతా చేసే బదులు ఎవరికి వారు స్వయం ఉపాధి రంగాన్ని ఎంచుకుంటే బ్యాంకు రుణాలు, నీటి సదుపాయాలు, విద్యుత్ సౌకర్యాలు ఇస్తే దేశీయంగానే చిన్నచిన్న పరిశ్రమలు స్థాపన సులువు కాగలదు. దానికి దావోస్ లాంటి సదస్సులకు వెళ్లడం, వెంపర్లాడడం, బతిమాడం వంటివన్నీ చేయకుండానే లక్ష్యం నెరవేర్చుకోగలం. కేవలం ఉన్న మానవ వనరులను,సహజ వనరులను ఉపయోగించుకుంటే మంచిది. అలాంటి ప్రయత్నాలు మొదలు కావాలి. ఎన్‌డిఎ భాగస్వామిగా ఉన్న చంద్రబాబు లాంటి వారు ఇలాంటి ప్రయత్నాలు చేయాలి. దేశీయంగా రుణాలను ఇచ్చేందుకు పారదర్శక విధానం అమలు కావాలి. తక్కువ వడ్డీలకు రుణాలు ఇచ్చేలా పాలసీలను రూపొందించాలి. అప్పుడే ఉపాధి పెరుగుతుంది. పరిశ్రమలు వస్తాయి. స్వయం ఉపాధి పెరుగుతుంది. ద్రవ్యోల్బణం తగ్గుతుంది. దావోస్ పర్యటనలతో డబ్బు వృధా చేసుకునే బదులు దేశీయ ఆలోచనలతో ముందుకు నడవడం అవసరం.

# రంగనాథ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

**- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి -రంగనాథ స్వామి ఆలయ కమిటీ పాలకవర్గం ప్రమాణస్వీకారం..**

**-చైర్మన్‌గా నల్లబోలు అనిల్‌రెడ్డి,...-రంగనాథ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం:-ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**

తుర్కయంజాల్, సాయి సూర్య :

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని తొర్రూరులో శ్రీ గోదారంగనాథ స్వామి దేవాలయ కమిటీ పాలకవర్గం ప్రమాణస్వీకారానికి ఎమ్మెల్యే రంగారెడ్డి హాజరయ్యారు. చైర్మన్‌గా నల్లబోలు అనిల్‌రెడ్డి, డైరెక్టర్లు సంరెడ్డి వెంకటరెడ్డి, మేకం ఎల్లయ్య, బాలగోని భూషణ్‌గౌడ్, డప్పు సుమలత ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. దేవాలయ నిర్మాణానికి

తొలి దశలో రూ.30లక్షలతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు. విడతల వారీగా ఆలయానికి నిధులు కేటాయిస్తామన్నారు. త్వరలో గుట్టపైకి సీసీ రోడ్డు నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, టెస్కాబ్ వైస్ చైర్మన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ అనురాధ, వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరితాధన్‌రాజ్‌గౌడ్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కొశికె ఐలయ్య, కౌన్సిలర్లు నక్క శివలింగంగౌడ్, పుల్లగుర్రం కీర్తనావిజయానంద్‌రెడ్డి, వేముల స్వాతి అమరేందర్‌రెడ్డి, రైతుబంధు సమితి మాజీ చైర్మన్ వంగేటి లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ యాదిరెడ్డి, నాయకులు కుంట గోపాల్‌రెడ్డి, వంగేటి గోపాల్‌రెడ్డి, వద్దిగళ్ల బాబు తదితరులు పాల్గొన్నారు.



# 200 నకిలీ నోట్ల చెలామణి

**-రద్దు చేయాలన్న ఆలోచన లేదన్న ఆర్‌బిఐ**

ముంబై,జనవరి20

ప్రస్తుతం మార్కెట్‌లో 500 మరియు 200 రూపాయల నోట్లు ఎక్కువగా చెలామణిలో ఉన్నాయి. దీనికి సంబంధించి రిజర్వ్ బ్యాంక్ కీలక ప్రకటన చేసింది. ఆర్‌బీఐ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. మార్కెట్లో నకిలీ 200 రూపాయల నోట్లు వస్తున్నాయని, నకిలీ నోట్లను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నామని ఆర్బీఐ తెలిపింది. కొందరు 200 రూపాయల నోట్లను రద్దు చేస్తున్నట్లు పుకార్లు సృష్టిస్తున్నారని, అలాంటిదేమి లేదని స్పష్టం చేసింది. ఇలాంటి వార్తలను ప్రజలు నమ్మవద్దని సూచించింది. 2000 రూపాయల నోట్లపై నిషేధం తర్వాత దేశంలో నకిలీ 200, 500 రూపాయల నోట్ల చెలామణి నిరంతరం పెరుగుతోందని ఆర్‌బిఐ తెలిపింది. ఇలాంటి పరిస్థితిని క్యాష్ చేసుకోవడానికి కేటుగాళ్లు రంగంలోకి దిగి నోట్లను రద్దు చేస్తున్నట్లు పుకార్లు సృష్టిస్తున్నారని ఆర్బీఐ తెలిపింది. లావాదేవీల సమయంలో ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హెచ్చరించింది. ఇటీవల తెలంగాణలో 200 రూపాయల నోట్లకు కలర్ జిరాక్సులు తీయించి చలామణి చేస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# అమెరికాలో హైదరాబాద్ యువకుడిపై కాల్పులు

**చైతన్యపురికి చెందిన యువకుడు మృతి**

హైదరాబాద్,జనవరి20

: అమెరికాలో హైదరాబాద్ యువకుడిపై దుండగులు కాల్పులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో చైతన్యపురికి చెందిన రవితేజ మృతి చెందాడు. అతని మరణ వార్త విని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మాస్టర్స్ చదివేందుకు 2022లో రవితేజ అమెరికా వెళ్లినట్లు సమాచారం. దీనిపై ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

# మళ్లీ తెలంగాణలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

హైదరాబాద్,జనవరి20( )

: తెలంగాణ వ్యాప్తంగా చల్లని గాలులు వీస్తున్నాయి. పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యాయి. చలి విపరీతంగా ఉండడంతో ఆయా ప్రాంతాల ప్రజలు వణికిపోతున్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు ప్రాంతాల్లో పొగమంచు కూడా దట్టంగా కురుస్తోంది. దీంతో వాహనదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు వారం రోజుల తర్వాత సోమవారం ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యాయి. హైదరాబాద్ నగర శివార్లతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు నగర శివార్లలోని మొయినాబాద్‌లో 9.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, సంగారెడ్డి, నిర్మల్ జిల్లాల్లో పలు చోట్ల 6.5 డిగ్రీల నుంచి 9 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. రాబోయే మూడు రోజుల పాటు పలు ప్రాంతాల్లో ఈ ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. 5 నుంచి 10 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. ఈ మూడు రోజుల్లో పొద్దున్నే పొగమంచు దట్టంగా కురిసే అవకాశం ఉందని, వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు.



# శబరిమల అయ్యప్పస్వామి ఆలయం మూసివేత

శబరిమల,జనవరి20

కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలో మండలపూజ, మకర విళక్కు వార్షిక పూజలు వైభవంగా ముగిశాయి. దీంతో సోమవారం ఉదయం ఆలయాన్ని మూసివేసినట్లు ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డు అధికారులు వెల్లడించారు. పందలం రాజకుటుంబ ప్రతినిధి త్రికేత్తనాల్ రాజరాజ వర్మ అయ్యప్ప దర్శనం చేసుకున్న తర్వాత సోమవారం ఉదయం 6.30 గంటలకు ఆలయాన్ని మూసివేశామని పేర్కొన్నారు. ఈ సీజన్‌లో 53 లక్షల మందికిపైగా భక్తులు అయ్యప్ప స్వామివారిని దర్శించుకున్నారని తెలిపారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. రెండు నెలల పాటు జరిగే మండల-మకర విళక్కు వార్షిక పూజల కోసం నవంబర్ 15న అయ్యప్ప ఆలయాన్ని పూజారులు తెరిచారు. మండల పూజ అనంతరం డిసెంబర్ 26న గుడిని మూసివేశారు. 41 రోజులపాటు సాగిన పూజల్లో లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు. నాలుగు రోజుల విరామం తర్వాత డిసెంబర్ 30న సాయంత్రం 4 గంటలకు మళ్లీ ఆలయాన్ని తెరిచారు. ఈ సీజన్‌లో అయ్యప్ప ఆలయానికి భక్తులు పోటెత్తారు. రోజుకు లక్షలాది మంది భక్తులు అయ్యప్పను దర్శించుకున్నారు. మొత్తం 53 లక్షల మందికిపైగా భక్తులు అయ్యప్ప దర్శనం చేసుకున్నట్లు టీడీపీ తెలిపింది. సోమవారం ఉదయం 5 గంటలకు ఆలయాన్ని తెరిచి, తూర్పు మండపంలో గణపతి హెూమం చేశామని. ఆ తర్వాత మేల్శాంతి అరుణ్ కుమార్ నంబూద్రి అయ్యప్ప విగ్రహానికి విభూతాభిషేకం నిర్వహించి, దానిని రుద్రాక్షలతో అలంకరించారని వెల్లడించారు. 'హరివరాసనం' పారాయణం తర్వాత మేల్శాంతి ఆలయ దీపాలను ఆర్పి గర్భగుడిని అధికారికంగా మూసివేశామని చెప్పారు. అనంతరం ఆలయ తాళాలను రాజకుటుంబ సభ్యుడికి అప్పగించామని తెలిపారు.

# జగిత్యాల ప్రభుత్వ దవాఖానాలో అమానవీయ సంఘటన

**-చావు బతుకుల్లో ఉన్న వ్యక్తిని పట్టించుకోని వైద్యులు**

జగిత్యాల,జనవరి20

జగిత్యాల జిల్లా ప్రభుత్వ దవాఖానాలో అమానవీయ సంఘటన చోటు చేసుకుంది. ప్రాణం పోయాల్సిన వైద్యులే పట్టనట్లుగా వ్యవహరించారు. బెడ్ పై నుంచి కిందపడి ఓ రోగి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నా.. ఎంతమందిని పిలిచినా ఎవరు స్పందించలేదు. గంటకు పైగా భూమయ్య బెడ్ కిందే పడిపోయి నరకయాతన అనుభవించాడు. నేను చచ్చిపోతున్న పట్టించుకోవాలని రోదించినా దవాఖాన సిబ్బందిలోని ఏ ఒక్కరి హృదయాన్ని కదిలించలేక పోయింది. ఆయన ఆర్తనాదం అరణ్య రోదనగానే మిగిలిపోయింది. కాగా, బీఆర్ఎస్ హయాంలో ఓ వెలుగు వెలిగిన ప్రభుత్వ దవాఖానులు నేడు పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు చర్చించుకుంటున్నారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో చిరుతపులి కలకలం

**-బర్రెపై దాడి.. ఆందోళన ప్రజలు**

రాజన్న సిరిసిల్ల,జనవరి20 రాజన్న సిరిసిల్ల జిల్లాలో చిరుత పులి కలకలం సృష్టిస్తోంది. ఓ బర్రెపై చిరుత దాడి చేసి చంపింది. చిరుత సంచారంతో స్థానిక రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గంభీరావుపేట మండల పరిధిలోని ముస్తాఫానగర్ గ్రామ శివారులో రాసమల్ల రాజు అనే రైతుకు వ్యవసాయ పొలం ఉంది. అయితే పొలంలోనే పశువుల కోసం ఓ షెడ్‌ను నిర్మించాడు. అందులో బర్రెను కట్టేసి ఆదివారం రాత్రి ఇంటికి వచ్చాడు. ఇక సోమవారం తెల్లవారుజామున పొలం వద్దకు వెళ్లి చూడగా, బర్రె రక్తపు మడుగులో పడి ఉంది. ఆందోళనకు గురైన రాజు.. గ్రామస్తులను అప్రమత్తం చేశాడు. ఇక అతని పొలంలో పులి పాదముద్రలను గుర్తించారు. దీంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. పులి పాదముద్రలను అధికారులు నిర్ధారించారు. అనంతరం రైతులను, స్థానికులను అధికారులు అప్రమత్తం చేశారు. చిరుత కదలికలపై రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

# మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్థుల పోరుబాట

**మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్థుల పోరుబాట**

**మైలారం గ్రామంలో ఆందోళనకు దిగిన స్థానికులు**

**ఆందోళనకారుల అరెస్ట్‌తో గ్రామంలో ఉద్రిక్తత**

నాగర్ కర్నూల్,జనవరి20(ఆర్ఎన్ఎ): నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం మైలారంలో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. 'మైనింగ్ వద్దు.. గుట్ట ముద్దు' అనే నినాదంతో రైతులు నేటి నుంచి రిలే నిరాహార దీక్షలకు సన్నద్ధమయ్యారు. దీంతో పోలీసులు ముందస్తుగా పలువురు రైతులు, స్థానికులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమ గ్రామానికి చెందిన రైతులను అక్రమంగా అరెస్ట్ చేశారని, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ? గ్రామస్తులు పెద్ద ఎత్తున మహిళలు, రైతులు రోడ్డుపైకి చేరి నిరసనకు దిగారు. అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. పురుగుల మందు డబ్బాతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన ఉధృతం చేశారు. గ్రామంలోనికి పోలీసులను రానీయకుండా ముళ్లకంచెలు వేశారు. మైలారం గ్రామస్తులు చేపట్టిన ఈ ఆందోళనకు మద్దతు తెలపడానికి హైదరాబాద్ నుండి బయలుదేరి వచ్చిన పౌరహక్కుల నేతలు ప్రొఫెసర్ హరగోపాల్, గడ్డం లక్ష్మణ్ లను కూడా పోలీసులు వెల్దండ వద్ద అడ్డగించి అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. దీంతో మైలారం గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. మైనింగ్ కు వ్యతిరేకంగా గ్రామస్తుల నిరసన కొనసాగుతోంది. అయితే రైతులు, గ్రామస్తులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. అక్రమ అరెస్టులు ఆపాలంటూ గ్రామస్తులు డిమాండ్ చేసారు. గ్రామానికి పోలీసులు రాకుండా కంచె ఏర్పాటు చేశారు. మైలారం గ్రామంలో ఉండే గుట్టపై క్వార్ట్జ్ ఖనిజాలను మైనింగ్ చేసేందుకు అనుమతులు లభించాయి. ఈ నేపథ్యంలో గత కొంత కాలంగా అక్కడ మైనింగ్ జరుగుతోంది. అనుమతుల నియమాలకు వ్యతిరేకంగా ఈ మైనింగ్ జరుగుతోందని పేర్కొంటూ గ్రామస్తులు గత కొద్ది రోజులుగా ఆందోళన చేపట్టారు. మైనింగ్‌పై ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ జరగలేదని, గ్రామ తీర్మానం కూడా ఫేక్‌గా సృష్టించి మైనింగ్ జరుపుతున్నారని గ్రామస్తులు ఆందోళన చేస్తున్నారు.

ఈ ఆందోళన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించేందుకు ఇటీవల హైదరాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దీనికి ప్రొఫెసర్ హరగోపాల్ కూడా సంఘీభావం తెలిపారు. దీంతో సోమవారం నుంచి రిలే నిరాహారదీక్షలు చేపట్టాలని గ్రామ సభ తీర్మానించింది. దీనికి హరగోపాల్‌ను ముఖ్య అతిథిగా పిలిచారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు సోమవారం తెల్లవారుజాము 4 గంటలకు గ్రామానికి వచ్చి నిరసనకారులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. మహిళలు గ్రామంలో రోడ్డుకు అడ్డంగా కంచె వేసి పోలీసులు రావద్దంటూ మహిళలు పురుగుల మందు డబ్బాలు పట్టుకుని నిరసన చేపట్టారు. చాలా కాలంగా మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్తులు పోరాటం చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో మైలారం గ్రామంలో సోమవారం తెల్లవారుజాము నుంచి ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. మైలారం మైనింగ్ వెలికితీత కార్యక్రమాన్ని నిలిపివేయాలని గత మూడు నెలలుగా ఆ గ్రామస్తులు శాంతియుత పోరాటం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మైలారం గ్రామ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రైతులు, ప్రజలు రిలే నిరాహార దీక్షలకు పూనుకున్నారు. దీంతో పోలీసులు గ్రామానికి చేరుకొని మహిళలను, రైతులను అరెస్ట్ చేశారు. అలాగే అచ్చంపేటలో ఉన్న మైలారం గ్రామ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడిని కూడా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది.



## సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో

# రూ.110కోట్లు మంజూరు....


**- తుర్కయంజాల్ కే..అధిక నిధులు. -ప్రతి వార్డును అభివృద్ధి చేసి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం.**

**-రూ.82కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**





తుర్కయంజాల్, సాయి సూర్య :
మున్సిపాలిటీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు.సోమవారం మున్సిపల్ పరిధిలో లో రూ.82కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి,రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, చైర్ పర్సన్ అనురాధ రాం రెడ్డి లతో కలసి శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుర్కయంజాల్ మున్సిపాలిటీ శరవేగంగా అభివృద్ధి సాధిస్తోందని, ప్రజావసరాలకు అనుగుణంగా పాలక వర్గం పని చేస్తుందన్నారు.నియోజకవర్గ పరిధిలో సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో ఇటీవల రూ.110కోట్లను ఇబ్రహీంపట్నం నియోజవకర్గానికి వచ్చాయని తెలిపారు. ఇందులో తుర్కయంజాల్‌కే అధిక నిధులు కేటాయించబోతున్నట్లు వెల్లడించారు. ప్రతి వార్డును అభివృద్ధి చేసి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ తుర్కయంజాల్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఆర్అండ్‌బీ నిధులతో అన్ని ప్రాంతాలకూ రోడ్లు వేయిస్తున్నామన్నారు. పురపాలిక పరిధిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా, చిల్డ్రన్స్ పార్కుల నిర్మాణం తదితర పనులు చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ వైస్ చైర్మన్, చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, రాష్ట్ర యువ జన కాంగ్రెస్ నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి,గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి,మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరితాధన్‌రాజ్‌గౌడ్,కమిషనర్ కె. అమరేందర్ రెడ్డి, డి. ఈ. బిక్షపతి, ఏ. ఈ చంద్రశేఖర్ రెడ్డి, రంగా రెడ్డి కౌన్సిలర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు కొత్త కుర్మ మంగమ్మ శివ కుమార్, టి. పి. సి. సి సభ్యులు, కౌన్సిలర్ కాకుమాను సునీల్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కొశికె ఐలయ్య, కౌన్సిలర్లు నక్క శివలింగంగౌడ్, బొక్క రవీందర్‌రెడ్డి, పుల్లగుర్రం కీర్తనావిజయానంద్‌రెడ్డి,మేతరి అనురాధ దర్శన్, మర్రి మాధవి మహేందర్‌రెడ్డి,రేవల్లె హరితాయాదగిరి వేముల స్వాతి అమరేందర్‌రెడ్డి, నారని కవితాశేఖర్‌గౌడ్, గుండా భాగ్యమ్మ ధన్‌రాజ్, బండారి బాలరాజు,కంబాలపల్లి ధన్‌రాజ్, కో అప్షన్ సభ్యులు నక్క సువర్ణ రాజు గౌడ్,మాజీ ఎంపీపీ యాదిరెడ్డి, మాజీ సర్పంచ్ నక్క రాధిక శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ నక్క స్రవంతి రమేష్ గౌడ్,నాయకులు కుంట గోపాల్‌రెడ్డి, వంగేటి గోపాల్‌రెడ్డి, గుత్తా వెంకట్ రెడ్డి ,సామ భీంరెడ్డి,వెంకటేష్ యాదవ్,వెంకట్ రావు,కొంతం వెంకటరెడ్డి (జానీ), డా.రాగ్యానాయక్ ,రాజు నాయక్,తదితరులు పాల్గొన్నారు.




## 'నేటి నుంచే వార్డు సభలు'

తుర్కయంజాల్, సాయి సూర్య :
తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం నుండి వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ అమరేందర్‌రెడ్డి తెలిపారు.సోమవారం కమిషనర్ మాట్లాడుతూ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన కోసం, వార్డుల వారీగా వార్డు సభలను నిర్వహిస్తున్నామని అన్నారు. మంగళవారం రోజున రాగన్నగూడ, మునగనూరు, కోహెడ, తొర్రూరు, బ్రాహ్మణపల్లి పరిధిలోని సభలు నిర్వహిస్తామన్నారు. బుధవారం రోజున తుర్కయంజాల్, కమ్మగూడ, ఇంజాపూర్, ఉమర్‌ఖాన్‌గూడలో వార్డు సభలు నిర్వహిస్తామని అమరేందర్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా కొత్తగా ఎవరైనా రేషన్ కార్డులకు, ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఆధార్ కార్డు, కులం సహా పూర్తి చిరునామాతో వార్డు సభల్లో సంప్రదించాలని సూచించారు.

## నేటి నుంచే వార్డు సభలు'

చండూర్,సాయి సూర్య :
చండూర్ మున్సిపాలిటీ పరిధిలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన కోసం మంగళవారం నుంచి వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మున్వర్ అలీ తెలిపారు. అర్హుల నుంచి దరఖాస్తుల పరిశీలన కోసం, వార్డుల వారీగా వార్డు సభలను నిర్వహిస్తున్నామని అన్నారు. మంగళవారం 1 వ వార్డు లో ఉప్పరి సంఘం భవనం, రెండో వార్డు లో పోస్ట్ ఆఫీస్ దగ్గర, మూడో వార్డు లో లక్కినేని గూడం ప్రైమరీ స్కూల్ వద్ద వార్డు సభలు నిర్వహిస్తామని మున్వర్ అలీ తెలిపారు. అదేవిధంగా కొత్తగా ఎవరైనా రేషన్ కార్డులకు, ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఆధార్ కార్డు, కులం సహా పూర్తి చిరునామాతో వార్డు సభల్లో సంప్రదించాలని సూచించారు.

## గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

**మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు దామెర దేవేందర్.**

నాంపల్లి,సాయి సూర్య:రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజాపాలనలో భాగంగా ఏర్పాటు చేసిన21 నుండి 24 కొనసాగుతున్న గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు దామెర దేవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు.సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతుభరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ఫలాలు అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్రప్రభుత్వం లక్ష్యమన్నారు.

## రికార్డు సృష్టించిన డేర్‌డెవిల్స్ టీమ్

**ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, లిమ్కా**

**బుక్ ఆఫ్ రికార్డ్స్ సహా 33 ప్రపంచ రికార్డులను సొంతం**

న్యూఢిల్లీ,జనవరి20 ఈ నెల 26న జరిగే 76వ గణతంత్ర దినోత్సవాలకు దేశ రాజధాని నగరంలోని కర్తవ్యపథ్ ముస్తాబవుతోంది. ఈ వేడుకలకు విదేశీ ప్రముఖులతోపాటు పారాలింపిక్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు, ఉత్తమ పని తీరు కనబరచిన గ్రామాల సర్పంచ్‌లు, చేనేత కళాకారులు, అటవీ, వన్య ప్రాణి సంరక్షకులు ఇలా దాదాపు 10,000 మంది ప్రత్యేక అతిథులను కేంద్రం ఆహ్వానించింది. ఇక గణతంత్ర వేడుకల్లో భాగంగా భారత ఆర్మీ ఇప్పటికే పలు విన్యాసాలు చేస్తోంది. ఈ క్రమంలో భారత ఆర్మీకి చెందిన డేర్‌డెవిల్స్ టీమ్ సరికొత్త రికార్డు సృష్టించింది. కదులుతున్న బైక్స్‌పై అత్యంత ఎత్తైన మానవ పిరమిడ్ (20.4 అడుగులు)ను నిర్మించి ప్రపంచ రికార్డు సృష్టించింది. తద్వారా అసాధారణమైన ఫీట్‌ను సాధించింది. ఏడు మోటార్ సైకిళ్లపై 40 మంది 2 కిలోమీటర్ల మేర ప్రయాణించడం ద్వారా ఈ ఘనతను అందుకుంది. ఆర్మీలోని మోటార్ సైకిల్ రైడర్ డిస్‌ప్లే టీమ్‌ను 'డేర్ డెవిల్స్' అని పిలుస్తారు. ఈ టీమ్‌కు సుదీర్ఘ చరిత్ర ఉంది. అంతేకాదు.. తమ ప్రదర్శనలతో అంతర్జాతీయ ప్రశంసలు కూడా అందుకుంది. ఈ టీమ్ ఇప్పటికే ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ సహా 33 ప్రపంచ రికార్డులను సొంతం చేసుకుంది. 1935 నుంచి ఇప్పటి వరకూ డేర్‌డెవిల్స్ టీమ్.. గణతంత్ర దినోత్సవ పరేడ్‌లు, ఆర్మీ డే పరేడ్‌లు సహా ప్రతిష్టాత్మక కార్యక్రమాల్లో దాదాపు 1,600 మోటార్ సైకిల్స్ ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

# ప్రియుడినిచంపిన ప్రియురాలికి ఉరిశిక్ష

**తిరువనంతపురం స్థానిక కోర్టు సంచలన తీర్పు**

**ఆమె నేరాన్ని తక్కువగా చేయరాదని భావించిన కోర్టు**

తిరువనంతపురం,జనవరి20

కేరళ రాజధాని తిరువనంతపురం కోర్టు మరో కీలక తీర్పు వెల్లడించింది. ప్రియుడిని చంపిన కేసులో ప్రియురాలికి ఉరిశిక్ష విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. 2022లో కేరళలో విషం కలిపిన కూల్‌డ్రింక్ ఇచ్చి ప్రియుడు శరోన్ రాజ్‌ను ప్రియురాలు గ్రీష్మ చంపిన ఘటన సంచలన సృష్టించింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. పూర్తి ఆధారాలు సేకరించి కోర్టుకు సమర్పించారు. ఆధారాలను పరిశీలించిన తిరవనంతపురం కోర్టు.. గ్రీష్మకు ఉరిశిక్ష విధిస్తూ కోర్టు వెలువరించింది. అంతేకాదు.. శరోన్ రాజ్ ను చంపేందుకు గ్రీష్మకు సహకరించిన బంధువుకు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. కేరళలో బాయ్‌ఫ్రెండ్‌ను 2022లో చంపిన గ్రీష్మ అనే యువతికి స్థానిక నెయ్యట్టింకర అదనపు జిల్లా సెషన్స్ కోర్టు మరణ శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ కేసులో మూడవ

నిందితుడు, ఆమెకు సహకరించిన ఆమె మేనమామ నిర్మలకుమారన్ నాయర్‌కు కోర్టు మూడు సంవత్సరాల కారాగార శిక్ష విధించింది. విద్యాపరమైన తన విజయాలు, గత నేర చరిత్ర లేకపోవడం, తన తల్లిదండ్రులకు ఏకైక కుమార్తెను కావడం వంటి కారణాలను పేర్కొని తనకు శిక్ష విధించడంలో కనికరం చూపాలని 24 ఏళ్ల దోషి కోర్టును అభ్యర్థించింది. అయితే, ఆమె క్రూర నేరానికి పాల్పడి, సాక్షాలను చెరిపివేసి, దర్యాప్తును తప్పుదోవ పట్టించిందని, ఆమె వయస్సును పరిగణనలోకి తీసుకోలేమని కోర్టు తన 586 పేజీల తీర్పులో స్పష్టం చేసినట్లు ప్రాసిక్యూటర్ వెల్లడించారు. తనతో రిలేషన్‌షిప్ ముగించేందుకు శరణ్ రాజ్ (23) ఒప్పుకోలేదని పెస్టిసైడ్ కలిపిన డ్రింక్ తాగించి అతనిని గ్రీష్మ చంపేసింది. ఆ ఘాతుకం జరిగిన సమయానికి ఆమె వయస్సు 22 సంవత్సరాలు. ఇక ప్రాసిక్యూషన్ నేరాన్ని రుజువు చేయడానికి సందర్భోచిత, డిజిటల్, శాస్త్రీయ అంశాలపై ఆధారపడిందని కోర్టు పేర్కొన్నది. దోషి దశలవారీగా ఈ నేరం సాగించడానికి కుట్ర పన్నిందని, ఆమెకు నేర నేపథ్యం ఉందని, గతంలో ఆ యువకుని హత్యకు ప్రయత్నించిన ఆమె దర్యాప్తును తప్పుదోవ పట్టించేందుకు అరెస్టు తరువాత తన ప్రాణం తీసుకునేందుకు ప్రయత్నించిందని కూడా కోర్టు పేర్కొన్నది. కాగా, ఇది అత్యంత అరుదైన కేసు అని, నిందితులకు ఉరిశిక్ష విధించాలని వాదించినట్లు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ విఎస్ వినీత్ కుమార్ మీడియాతో చెప్పారు. ఇది ఆదర్శప్రాయమైన ఒక తీర్పుగా ఆయన పేర్కొన్నారు. 2022లో గ్రీష్మ తన ప్రియుడు శరణ్ రాజ్‌కు పారాక్వాట్ అనే పెస్టిసైడ్ కలిపిన ఆయుర్వేద టానిక్‌తో విషం ఇచ్చింది. దానితో అతని శరీరంలోని పలు అవయవాలు విఫలం కావడంతో 11 రోజుల తరువాత అతను చనిపోయాడు. తమిళనాడుకు చెందిన ఆర్మీలో పని చేసే ఒక వ్యక్తితో తన పెళ్లి ఖాయం కావడంతో రాజ్‌తో తన అనుబంధాన్ని ముగించాలని ఆమె అనుకుంది. కానీ తమ సంబంధం ముగింపునకు అతను నిరాకరించడంతో హత్యకు గ్రీష్మ పథకం వేసింది. హతుడు శరణ్ రాజ్ తిరువనంతపురం జిల్లా పరశ్శల వాసి. హత్యతో సహా భారతీయ న్యాయ సంహితలోని వివిధ సెక్షన్ల కింద గ్రీష్మ దోషిగా తేలింది. ఆమె మేనమామ నిర్మలకుమారన్ నాయర్ సాక్షాలను ధ్వంసం చేసిన కేసులో దోషిగా తేలాడు. అయితే, కస్టడీలోకి తీసుకున్న అతని తల్లి సాక్షాధారాలు లేకపోవడంతో నిర్దోషిగా విడుదల అయింది. కేసు దర్యాప్తును పర్యవేక్షించిన అప్పటి ఎస్‌పి డి శిల్ప కోర్టు తీర్పును స్వాగతిస్తూ, పోలీస్ దర్యాప్తు బృందం సమష్టి కృషికి ఇది విజయం అని అన్నారు.



# ఘనంగా కామ్రేడ్ బొడ్డుపల్లి శేఖర్ 23వ వర్ధంతి

**-ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలమల్ల ఆంజనేయులు.**


దేవరకొండ, సాయి సూర్య న్యూస్ జనవరి 20

అమరజీవి కామ్రేడ్ బొడ్డుపల్లి శేఖర్ 23వ వర్ధంతి సందర్భంగా సోమవారం నాడు ఆయన స్మారక స్తూపం వద్ద ఏఐఎస్ఎఫ్ దేవరకొండ డివిజన్ సమితి ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు,సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కామ్రేడ్ బొడ్డుపల్లి శేఖర్ స్మారక స్థూపానికి,చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.అనంతరం వారు మాట్లాడటం జరిగింది.

ఈ కార్యక్రమం ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు సురిగి వినయ్ అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి పల్లా రంగారెడ్డి, ఏఐఎస్ఎఫ్ డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ శంషోద్దీన్,డివిజన్ కోశాధికారి వట్టేపు శివకుమార్,గర్ల్స్ కన్వీనర్ నూనె జ్యోతి,కో కన్వీనర్స్ ఎన్ స్వాతి, ఎన్ వీణ,మండల కార్యదర్శి పల్లె దినేష్, పట్టణ కార్యదర్శి నాయక్ సిద్దార్థ్, డిండి అధ్యక్షులు కాంపల్లి భాను,నాయకులు జక్కుల హరీష్,చరణ్, ప్రభావతి,మధు,నవీన్, అఖిల,అనూష తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా

**-కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్ రెడ్డి.**



ఇబ్రహీంపట్నం, సాయి సూర్య న్యూస్ జనవరి 20

మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు, సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించే విధంగా కృషి చేస్తానని అన్నారు. గ్రామంలో ఎవరైనా రేషన్ కార్డ్, ఇందిరమ్మ ఇండ్ల సమస్య ఏది ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ప్రజలకు తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కార దిశగా ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

# ఉత్తరాది భక్తుల కోసమే నమూనా ఆలయం

## ప్రయాగరాజ్ ఆలయంలో పూజలు చేసిన ఛైర్మన్

తిరుమల,జనవరి20(

ఉత్తరాది భక్తుల కోసం ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభ మేళా సందర్భంగా శ్రీవారి నమూనా ఆలయం ఏర్పాటు చేసినట్లు టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు తెలియజేశారు. ప్రయాగ్ రాజ్ లోని శ్రీవారి నమూనా ఆలయాన్ని టీటీడీ చైర్మన్ నాయుడు దంపతులు సోమవారం సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు హెచ్ డీపీపీ సెక్రెటరీ శ్రీరామ్ రఘునాథ్, డిప్యూటీ ఈవో గుణ భూషణ్ రెడ్డి, స్వాగతం పలికారు. దర్శనానంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన ఆలయ ప్రాంగణంలో శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చతుర్వేద హవనంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 13 నుండి ఫిబ్రవరి 26వ తేది సంక్రాంతి నుండి శివరాత్రి వరకు 45 రోజుల పాటు జరుగుతున్న ప్రయాగ్ రాజ్ లోని మహా కుంభ మేళాలో శ్రీవారి నమూనా ఆలయం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని అన్నారు. 250 మంది టీటీడీ సిబ్బంది డిప్యూటేషన్ పై శ్రీవారి నమూనా ఆలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఉత్తరాదిలో ధర్మ ప్రచారం కోసం చక్కటి ఏర్పాట్లు చేసిన హిందూ ధర్మ ప్రచార పరిషత్ అధికారులకు అభినందనలు తెలిపారు. ఉత్తరాది భక్తులందరూ శ్రీవారిని నమూనా ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అయోధ్య శ్రీరాముడికి టీటీడీ తరపున తొలిసారిగా పట్టు వస్త్రాలు సమర్పించడం జరిగిందని, ఈ సందర్భంగా సరయూ నదీ తీరంలో స్వామివారికి వైభవంగా నిర్వహించిన స్నపన తిరుమంజనం కార్యక్రమానికి విశేష సంఖ్యలో భక్తులు తరలి వచ్చారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏఈవో ప్రభాకర్ రెడ్డి, బొక్కసం ఇన్ ఛార్జ్ గురురాజ స్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తిరుమలలో యధావిధిగా దర్శనాలు

## -ఉత్తరద్వార దర్శనాలు ముగియడంతో నిత్య కౌంకర్యాలు

తిరుమల,జనవరి20

శ్రీవారి ఆలయంలో సోమవారం నుంచి యధావిధిగా కౌంకర్యాలు, భక్తులకు దర్శనాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం అర్ధరాత్రి వైకుంఠ ద్వారాలు మూతపడ్డాయి. పదిరోజుల పాటు టీటీడీ అధికారులు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించారు. ఈ పది రోజుల్లో దాదాపు 6 లక్షల 83 వేల 304 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకుని.. ఉత్తరద్వార ప్రవేశం చేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈ నెల పదో తేదీన వైకుంఠ ద్వారాలను తెరిచిన విషయం తెలిసిందే. గతేడాది తరహాలోనే పది రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించారు. చివరిగా ఆదివారం అర్ధరాత్రి ఏకాంతసేవతో వైకుంఠ ద్వారాలను మూసివేశారు. ఇక సోమవారం నుంచి యధావిధిగా శ్రీవారి దర్శనాలు ప్రారంభ మయ్యాయి. తిరిగి ఈ ఏడాది డిసెంబర్ 30వ తేదీన వైకుంఠ ఏకాదశి రావడంతో టీటీడీ అధికారులు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించనున్నారు. కాగా ఆదివారం చివరి రోజు కావడంతో వైకుంఠ ద్వార దర్శనం చేసుకునేందుకు భక్తులు భారీగా తిరుమలకు తరలి వచ్చారు. కేవలం దర్శనం టికెట్లు, టోకెన్లు ఉన్న భక్తులకు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం కల్పించారు. ఈ మేరకు ముందుగానే భక్తులకు టోకెన్లు, టికెట్లను కూడా టీటీడీ అధికారులు జారీ చేశారు. గత తొమ్మిది రోజులుగా టోకెన్లు, టికెట్లు ఉన్న భక్తులకు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం టీటీడీ కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో శని, ఆదివారాలకు సంబంధించి 50వేల టోకెన్లను టీటీడీ ముందస్తుగా జారీ చేసింది. అలాగే ఆన్‌లైన్‌లో 15 వేల ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను కూడా జారీ చేసింది.ఆదివారంతో శ్రీవారి వైకుంఠ ద్వారా దర్శనం ముగియనుండటంతో తిరుమలలో అనూహ్యంగా భక్తుల రద్దీ పెరిగింది. ఈనెల 10 నుంచి 19 వరకు అంటే దాదాపు పది రోజుల పాటు శ్రీవారి ఆలయంలో భక్తులకు టీటీడీ వైకుంఠ ద్వార దర్శనం కల్పించింది. రోజుకు 70 వేల మందికి వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు టీటీడీ అధికారుల ఏర్పాట్లు చేశారు. మరోవైపు టీటీడీ ఉద్యోగులకు, వారి కుటుంబసభ్యులకు కూడా ఒక ఉద్యోగికి ఐదు ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను జారీ చేశారు. అలిపిరి చెక్ పాయింట్ వద్ద కిలో మీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. భద్రతా సిబ్బంది కూడా తనిఖీలను వేగవంతం చేసి కార్లను తిరుమలకు పంపించారు.

# రోడ్డుప్రమాదంలో ఇద్దరు హైదరాబాదీల మృతి

తిరుపతి,జనవరి20 :

తిరుపతి జిల్లా రేణిగుంట-కడప ప్రధాన రహదారిలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. తిరుమల శ్రీవారి దర్శించుకుని హైదరాబాద్ వెళ్తుండగా ప్రమాదం జరిగింది. రేణిగుంట-కడప ప్రధాన రహదారిలోని కుక్కల దొడ్డి వద్ద ప్రైవేట్ బస్సును కారు ఢీకొనడంతో ఈ ఘటన సంభవించింది. కారులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలిద్దరూ అక్కడకక్కడే మృతి చెందారు. హైదరాబాద్ లోని పటాన్ చెరువుకు చెందిన సందీప్ (45) అంజలీదేవి(40)గా పోలీసులు గుర్తించారు. విషయం తెలుసుకున్న రేణిగుంట ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాలను ఆసుపత్రికి తరలిస్తున్నారు.

# దావోస్ చేరుకున్న సిఎం చంద్రబాబు

## -ఘనంగా స్వాగతించిన ఎన్నారై పోరమ్ సభ్యులు

అమరావతి,జనవరి20 దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనడానికి నిన్న అర్ధరాత్రి న్యూఢిల్లీ నుండి బయలుదేరిన ఏపీ సీఎం చంద్రబాబు బృందం సోమవారం స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్‌కు చేరుకుంది. అక్కడి విమానాశ్రయంలో యూరప్ టిడిపి ఫోరం సభ్యులు, ఎన్ఆర్ఐలు కలిసి చంద్రబాబుకు ఘనస్వాగతం పలికారు. సీఎంతోపాటుగా కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, అధికారులు ఉన్నారు. జ్యూరిచ్‌లో పెట్టుబడిదారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు బృందం సమావేశం కానుంది. మరోవైపు దావోస్ సదస్సుకు వచ్చిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు ఎయిర్‌పోర్టులో చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కాసేపు ముచ్చటించుకున్నారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన తెలుగు రాష్ట్రాల సీఎంలు స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్ ఎయిర్‌పోర్టులో కలుసుకున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అక్కడ కాసేపు ముచ్చటించుకున్నారు. రెండు రాష్ట్రాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ పెట్టుబడులపై ముఖ్యమంత్రుల మధ్య చర్చ జరిగింది. రేవంత్‌రెడ్డి వెంట తెలంగాణ ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు ఉన్నారు. మరోవైపు జ్యూరిచ్ చేరుకున్న సీఎం చంద్రబాబు బృందానికి ఎయిర్‌పోర్టులో యూరప్ తెదేపా ఫోరం సభ్యులు, ఎన్ఆర్ఐలు ఘనస్వాగతం పలికారు. చంద్రబాబు, లోకేశ్‌తో ఎన్ఆర్ఐ తెదేపా నేతలు ఫొటోలు దిగారు.

# అవినీతిమయంగా రేవంత పాలన

## -బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపణ

నిజామాబాద్,జనవరి20

రేవంత్ ప్రభుత్వ పాలన పూర్తి అవినీతి మయంగా మారిందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. బీజేపీ నిజామాబాద్ జిల్లా కార్యాలయంలో రాజ్యాంగ సంవిధాన గౌరవ ధివస్‌పై సోమవారం వర్క్ షాప్ నిర్వహించింది. ఈ వర్క్‌షాప్‌లో ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. పసుపు బోర్డు దేశానికే గర్వకారణమని చెప్పారు. పసుపు బోర్డు సాధించిన ఎంపీ ధర్మపురి అరవింద్‌కు అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో 13 కుంభకోణాలు జరిగాయని.. వాటిని ఆధారాలతో సహా బయట పెట్టినా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి ఎఫ్.అర్.బి.ఎం పరిధిని దాటి విపరీతంగా అప్పులు చేస్తున్నారని ఆరోపించారు. ఇన్ని అప్పులు చేసినప్పటికీ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా ఎందుకు పూర్తిగా అమలు చేయలేక పోతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ స్వార్థం కోసం పనిచేస్తే , బీజేపీ ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తుందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

# దావోస్ చేసుకున్న సిఎం రేవంత్ బృందం

## పెట్టుబడులు లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం

హైదరాబాద్,జనవరి20

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం దావోస్ చేసుకుంది. ఆయనవెంట ఐటిశ్శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఐటి సెక్రటరీ జయేశ్ రంజన్ ఇతర ప్రతినిధులు ఉన్నారు. సింగపూర్ పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకుని ఆదివారం రాత్రి దావోస్ పర్యటనకు బయలు దేరింది. దావోస్‌లో నాలుగు రోజుల పాటు జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో పాల్గొంటారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం వేదికగా తెలంగాణకు ఉన్న సానుకూలతలను చాటి చెప్పి పెట్టుబడులను తెచ్చే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి బృందం దావోస్ పర్యటనకు వెళ్లింది. పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా దావోస్‌లో రేవంత్ రెడ్డి పర్యటన కొనసాగుతుంది. ప్రపంచ అగ్రశ్రేణి పరిశ్రమలు, సంస్థల అధినేతలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీకానున్నారు. పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణను ప్రపంచానికి పరిచయం చేసేందుకు దావోస్ పర్యటనను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. గత ఏడాది దావోస్ పర్యటన సందర్భంగా రాష్ట్రానికి రూ.40 వేల కోట్ల పెట్టుబడులను ప్రభుత్వం సమీకరించింది. ఈసారి అంతకు మించి పెట్టుబడులను తేవడమే లక్ష్యంగా తమ పర్యటన కొనసాగుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల అధికారులతో సమీక్షలో వెల్లడించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులతో అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శిస్తాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు హైదరాబాద్ అడ్డాగా మారింది. ఐటీ, ఏఐ, ఫార్మా, తయారీ రంగాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతోపాటు ఇటీవల ప్రకటించిన పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి విధానం (క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ)పై ప్రముఖ కంపెనీలు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి. గత ఏడాది దావోస్ పర్యటనతోపాటు అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలతో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయి. కాగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మరో భారీ ఐటీ పార్కు ఏర్పాటు కానుంది. రూ.450 కోట్లతో కొత్త ఐటీ పార్కును ఏర్పాటు చేసేందుకు సింగపూర్‌కు చెందిన క్యాపిటల్ ల్యాండ్ కంపెనీ ముందుకు వచ్చింది. సుమారు 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక సౌకర్యాలతో ఈ ఐటీ పార్కును ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. దావోస్ వేదికగా మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు జరిగే 'ప్రపంచ ఆర్థిక ఫోరం' వార్షిక సదస్సులో ఈ బృందం పాల్గొననుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కంపెనీలు ఈ సదస్సుకు హాజరు కానున్న నేపథ్యంలో.. ఆ వేదికపై తెలంగాణలో కంపెనీల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను వివరించి, హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా పరిచయం చేయనున్నారు.



# కాంగ్రెస్ 6 సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలి

-సిపిఎం మండల కమిటీ సభ్యులు ఏ జంగయ్య

-కష్టజీవుల సిపిఎం పార్టీ ని ఆదరించండి

-రాష్ట్ర మహాసభలకు విరహలాలు ఇవ్వండి

-సిపిఎం శాఖ కార్యదర్శి సిహెచ్ సత్యం, కే గిరికాంత్



యాచారం సూర్య న్యూస్ ( జనవరి 20):.
కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి  ఆరు సంక్షేమ పథకాలను అర్హులైన పేద ప్రజలందరికీ అమలు చేయాలని సిపిఎం మండల కమిటీ సభ్యులు ఆలంపల్లి జంగయ్య, గ్రామ శాఖ కార్యదర్శిలు సిహెచ్ సత్యం, కే , గిరి కాంత్ డిమాండ్ చేశారు. సోమవారం అనంతరం వారు మాట్లాడుతూ..సిపిఎం పార్టీ రాష్ట్ర నాలుగవ మహాసభలు సంగారెడ్డిలో జనవరి 25 నుండి 28 వరకు జరుగుతాయన్నారు. గ్రామ ప్రజల నుండి రెండవ రోజు పండు క్యాంపియన్ నిర్వహిస్తున్నారు. సిపిఎం కష్టజీవుల పార్టీ, నిరంతరం ప్రజా సమస్యల పైన పోరాటాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. నిరుపేదలకు జానెడు జాగలేక అల్లాడిపోతుంటే ఇండ్ల స్థలాల కోసం పోరాటం చేసింది. నేటికీ చింతపట్ల గ్రామంలో ఇల్లు లేని పేదలకి ఇండ్ల స్థలాల్లో పంచాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని అన్నారు. రైతుల రుణమాఫీ సక్రమంగా అమలు జరగలేదన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలను పరిష్కరించడం లో నిర్లక్ష్యం చేస్తున్నదని అన్నారు. అన్ని వర్గాల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతున్నదన్నారు. రైతులు కార్మి కులు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఆర్థిక విధానాల్లో బిజెపి కాంగ్రెస్ కు తేడా లేకుండా పోయిందని వారు మండిపడ్డారు. ప్రజలు, రైతులు, ప్రతి ఒక్కరు సిపిఎం పార్టీకి విరాళాలు ప్రజా ఉద్యమాలకు అండగా నిలవాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మచ్చ జంగయ్య, మెతుకుపల్లి రాములు, మస్కి గణేష్, మస్కి ప్రేమ్, మస్తు పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

# నాగర్ కర్నూల్ మాజీ ఎమ్ పీ మంద జగన్నాథం చిత్రపటానికి నివాళులు అర్పించిన - ఎమ్మెల్యే



చండూర్ జనవరి 20 (సాయి సూర్య న్యూస్):
మునుగోడు నియోజకవర్గం శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నాగర్ కర్నూల్ మాజీ ఎంపీ మంద జగన్నాథం  చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు నడిపించడంలో కీలక పాత్ర పోషించి, తెలంగాణ గొంతును పార్లమెంటులో గట్టిగా వినిపించిన మహానేత మంద జగన్నాథం. మంద జగన్నాథం తో నాకు ఉన్న వ్యక్తిగత అనుబంధం ఎంతో ప్రత్యేకమైనది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ మద్దతుగా నిలుస్తానని భరోసా ఇస్తున్నాను అని అన్నారు.

# కంకణాల ఇంట వివాహ వేడుకకు కేటీఆర్ కు ఆహ్వాన పత్రిక

-బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి.



నాంపల్లి, జనవరి 20 (సాయి సూర్య)
కంకణాల వారి ఇంట 2025 ఫిబ్రవరి 02 న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంకణాల ప్రవీణ వెంకట్ రెడ్డి కుమార్తె సౌమ్య అనిల్ వెంకట్ రెడ్డిల వివాహ వేడుకకు కుటుంబ సమేతంగా హాజరై వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావుకు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి వివాహ శుభలేఖను అందజేశారు.



# నేడు గ్రామ సభలను విజయవంతం చేయాలి

-ఎంపీడీవో నరేందర్ రెడ్డి -తాసిల్దార్ అయ్యప్ప

-మండల అధికారులతో సమావేశం ఏర్పాటు

-ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు పారదర్శకంగా అందాలి



యాచారం సూర్య న్యూస్ (జనవరి 20):.
తెలంగాణ ప్రభుత్వం, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు తేదీ 21 నుండి 24 వరకు యాచారం మండలంలో 24 గ్రామపంచాయతీలలో ప్రత్యేక అధికారుల అధ్యక్షతనతో సమావేశాలు ఏర్పాటు చేయనట్లు యాచారం ఎంపీడీవో నరేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం యాచారం మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అధికారులు మాట్లాడుతూ... జనవరి 21న ఉదయం 9 గంటలకు.. నందివనపర్తి, సింగారం, మంతన్ గౌరెల్లి, మధ్యాహ్నం 1:00 గంటలకు అయ్యవారిగూడెం, మల్కీజ్ గూడ, కేసి తండా లో ఆయా గ్రామాల ఇన్చార్జ్ అధికారులు సమయానికి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వం ప్రతిష్మాతకంగా చేపట్టిన సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ భరోసా, రైతు భరోసా లబ్ధిదారులకు పారదర్శకంగా ఎంపిక చేయాలని సూచించారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని వారు కూడా.. కొత్తగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ప్రజలందరూ సద్వినియం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాచారం తాసిల్దార్ అయ్యప్ప, సబ్ ఇన్స్పెక్టర్ మధు, మండల వ్యవసాయ అధికారి రవీంద్రనాథ్, ఇంజనీర్ పి ఆర్, డిప్యూటీ ఇంజనీర్ ఐబి, పంచాయతీ ప్రత్యేక అధికారులు, ఏపీఎం సుదర్శన్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ లు, ఎంజిఎన్ఆర్జిఎస్ అధికారులు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు రాములుపై దాడి చేసిన దుండగులను వెంటనే శిక్షించాలి

-మోడల్ స్కూల్, ప్రభుత్వ పాఠశాలలో నిరసన
-అయ్యప్ప స్వాములపై విరుచుకుపడ్డ ఉపాధ్యాయులు
-బీఎస్పీ నాయకురాలు కుమారు శాంత

యాచారం సూర్య న్యూస్ (జనవరి 20):.
రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం, తుక్కుగూడ మున్సిపాలిటీలో ఉపాధ్యాయులు కంబాలపల్లి రాములు పై దాడి చేసిన దుండగులను వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా బీఎస్పీ నాయకురాలు కుమారి శాంత డిమాండ్ చేశారు. సోమవారం అనంతరం.. మండల పరిధిలో గునుగల్ మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. తుక్కుగూడ ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి కన్నె స్వామి మాలవేసి పాఠశాలకు వచ్చిన సందర్భంగా.. తోటి విద్యార్థుల లాగే ఎక్కాలు చదివించడంతో ఆ యొక్క స్వామి విద్యార్థికి కాలు తగిలింది, బిజెపి ఆర్ఎస్ఎస్ అయ్యప్ప స్వాములు పాఠశాలలోకి చొరబడి ఉపాధ్యాయుడు పై దాడి చేయడం అసభ్యకరమైన పదజాలం వాడుతూ చాలా దుర్మార్గమన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయులు అందరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఒక దళిత ఉపాధ్యాయునిపై అయ్యప్పలు దాడి చేయడం ఏ ఏమైనా చర్య అని అన్నారు. దాడి చేసిన అయ్యప్పలను చట్టపరంగా శిక్షించే వరకు ఉపాధ్యాయుడికి అండగా ఉంటామని తెలియజేశారు.










# పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన నాంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కత్తి రవీందర్ రెడ్డి గారు సింగిల్ విండో చైర్మన్ గట్టుపల్లి నర్సిరెడ్డి గారు





నాంపల్లి జనవరి 20 (సాయి సూర్య)
ఈరోజు నాంపల్లి మండలం మహమ్మదాపురం గ్రామానికి చెందిన సింగిల్ విండో డైరెక్టర్ ఏరెడ్ల వెంకట్ రెడ్డి గారి తండ్రి  ఏరెడ్ల రామ్ రెడ్డి గారి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కత్తి రవీందర్ రెడ్డిలిగారు మరియు సింగిల్ విండో చైర్మన్ గట్టుపల్లి నర్సిరెడ్డి గారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఏరెడ్ల రఘుపతి రెడ్డి మలిగిరెడ్డి చంద్రారెడ్డి రఘుపతి రెడ్డి తౌర్య సంగేపు గణేష్ దండిగా సత్తయ్య అన్నెపాక హరీష్  మరియు డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది

# ఎమ్మెల్యే కసిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

-జర్నలిస్టు నాయకులు ఈర్ల చంద్రం



యాచారం సూర్య న్యూస్ ( జనవరి 20):. కల్వకుర్తి నియోజకవర్గం శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి కి జన్మదిన సందర్భంగా.. సీనియర్ పాత్రికేయులు జర్నలిస్టు సంఘం నాయకులు వీర్ల చంద్రం ఆయన నివాసంలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేసి, శాలువాతో సన్మానించారు. కల్వకుర్తి నియోజకవర్గం ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని కోరారు. భవిష్యత్తులో మంత్రి పదవి రావాలని ఆయన ఆశీర్వదించారు.

# కంబాలపల్లి రాములు పై దాడి చేసిన దుండగులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి

-మంచాల, ఆరుట్ల లో భాగ్య సంఘాల రాష్ట్ర నాయకులు నిరసన

-ఉపాధ్యాయుడిని కులం పేరుతో దూషించడం

-అయ్యప్ప మాలలో విద్యార్థి ని కాళ్లు ముగించడం చాలా దుర్మార్గం




యాచారం సూర్య న్యూస్ ( జనవరి 20):.
ప్రధానోపాధ్యాయులు కంబాలపల్లి రాములు పై దాడికి పాల్పడిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని జిహెచ్ఎంఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిధర్ గౌడ్, బి టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ యాదగిరి, టి టి ఏ రాష్ట్ర అధ్యక్షులు హరి కిషన్ డిమాండ్ చేశారు. సోమవారం మంచాల, ఆరుట్ల ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర నాయకులు నిరసన తెలిపి, జరిగిన ఘటనను ఖండించారు., రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం, తుక్కుగూడలో 21 డిసెంబర్ 2024న శనివారం సాయంత్రం ప్రధానోపాధ్యాయులు రాములు 8వ తరగతి విద్యార్థులు బయట వరండాలో విద్య బోధన చేస్తున్న సమయంలో ఒక్కొక్క విద్యార్థికి ఎక్కాలను చదివిస్తున్నారు. ఆ సమయంలోనే అయ్యప్ప మాల వేసుకున్న విద్యార్థిని కూడా ఎక్కాలు చదవాలని లేపే ప్రయత్నంలో అనుకోకుండా ఆ విద్యార్థికి మోకాలు తగిలింది. మరసటి రోజు అయ్యప్ప మాలదారులు ప్రభుత్వ పాఠశాలలోకి కన్నస్వామి అయ్యప్పని కాలుతోనే తన్నుతావా అని, ఉపాధ్యాయులు రాములు వ్యక్తిగత దాడి చేసి, ఎస్సీ కులానికి చెందిన వాడని, ఉపాధ్యాయుడు రాములపై దాడి చేయడం, అసభ్యకరమైన పదజాలం వాడుతూ, విచక్షణ రహితంగా కొట్టడం, వంటిపై దుస్తులు వేసుకున్న అంగీ, బనియన్, చింపి వేశారు. విద్యార్థిని కాళ్లు మొక్కించారు. ప్రధానోపాధ్యాయుడు రాములకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దాడి చేసిన దుండగులను వెంటనే చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కే శ్రీకాంత్, యుటిఎఫ్ మండల అధ్యక్షుడు అజ్మత్ ఖాన్, పిఆర్టియు మండల గౌరవ అధ్యక్షులు ఎండి జావేద్, ప్రొఫెసర్ పద్మశా, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుప్రియ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్ గౌడ్, ఉపాధ్యాయుల సుమలత, రామాంజన, మోతిలాల్, వెంకట్ నర్సయ్య, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

# గ్రామ సభలో లబ్ధిదారుల ఎంపిక గురించి అధికారుల సమావేశం

చండూర్ జనవరి 20 (సాయి సూర్య న్యూస్):
చండూర్ మండలంలో జనవరి 21 తేదీ నుంచి 24 తేదీ వరకు రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డుల కొరకు గ్రామ సభలను ఆమోదం మేరకు లబ్ధిదారుల ఎంపిక చేయనున్నట్లు ఎంపీడీవో రాంరెడ్డి, ఎమ్మార్వో దశరథ తెలిపారు. సోమవారం రోజు చండూర్ మండలం లోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇటీవల సమగ్ర కుటుంబ సర్వే లో డోర్ టు డోర్ సర్వే చేసి లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. గ్రామ సభలో రెవెన్యూ, అగ్రికల్చర్, పంచాయితీరాజ్ అధికారులు గ్రామ సభలు నిర్వహించి ప్రజల సమక్షంలో లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు వారు తెలిపారు. గ్రామ సభలు ముగిసిన తరువాత కూడా అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా ప్రక్రియ నిరంతరము కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఎ ఓ చంద్రిక, ఎమ్ పీ ఓ శ్రీనివాసులు, ఎంపీఓ పుల్లయ్య, మండల ఎఈఓలు, తదితరులు పాల్గొన్నారు.



# చింతపల్లి మండలంలో సీసీ,బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

-ప్రతి ఆవాసము నుండి మండల కేంద్రానికి సీసీ రోడ్లు, బీటీ రోడ్లు.
-నియోజకవర్గ అభివృద్దే ప్రధాన లక్ష్యం -ఎమ్మెల్యే బాలు నాయక్ గారు.





**చింతపల్లి, సాయి సూర్య ప్రతినిధి జనవరి 20**

చింతపల్లి మండల పరిధిలోని మాల్ గొడకొండ్ల, వీటినగర్ గ్రామంలో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై,సీసీ రోడ్డు నిర్మాణ పనులను శంకుస్థాపన చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధియే తన ప్రధాన లక్ష్యమని అన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే పేదలకు సేవ చేయాలనే సంకల్పంతో ప్రతి గ్రామం నుండి మండల కేంద్రానికి సీసీ రోడ్డు,బీటీ రోడ్లు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు.తాను శాసన సభ్యునిగా గెలిచిన అనతి కాలంలోనే దేవరకొండ నియోజకవర్గంలో అన్ని మండలాన్ని అభివృద్ధి చేసేందుకు తాను శాయశక్తుల కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. అదేవిధంగా అన్ని గ్రామాలలో మౌలిక వసతులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే జరుగుతుందని, అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలవాలని కోరారు.అనంతరం మదనాపురం గ్రామ పరిధిలోని శ్రీ లక్ష్మి నరసింహ్మా స్వామి దేవాలయం నూతన పాలక వర్గ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని,పాలక వర్గ చైర్మన్, సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి,శ్రీ లక్ష్మి నరసింహ్మా స్వామి వారిని దర్శించుకొని, వేద పండితుల చేత ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవ రెడ్డి, మాజీ ఎంపీపీలు భవాని పవన్ కుమార్, రవి నాయక్,మండల పార్టీ అధ్యక్షులు అంగిరేకుల నాగభూషణం,మాజి జడ్పీటీసీలు హరి నాయక్, జంగడి నర్సింహ్మా,మాస మంజుల భాస్కర్,వైస్ ఎంపీపీ యాది గౌడ్, మాజి మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కామల్ల వెంకటయ్య, పిఎసిఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య,మండల నాయకులు దోతి రెడ్డి, అంగిరేకుల గోవర్ధన్,నర్సి రెడ్డి,శ్రీనివాస్ యాదవ్,కొండల్ యాదవ్,మాజి సర్పంచులు ముచ్చర్ల యాదగిరి,రవీందర్ గౌడ్,మాజీ ఎంపీటీసీ వెంకట్ నర్సింహ్మా రెడ్డి,ప్రజా ప్రతినిధులు, మండల ముఖ్య నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన సంఘం అధ్యక్షులు,పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

వికారాబాద్ జిల్లా :ఈ నెల 21 నుండి 24 వరకు గ్రామ సభలను ఖచ్చితంగా షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలిగ్రామ సభలకు విస్తృత ఏర్పాట్లు చేయాలి, లబ్ధిదారుల ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యం ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు అధికారులందరూ అంకితభావంతో పనిచేయాలి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సుధీర్ , అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లింగ్యా నాయక్ ల తో కలిసి జిల్లా కలెక్టర్, జిల్లాలోని ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, ఇతర సంబంధిత అధికారులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జనవరి 26న అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల (రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు) పథకాలపై ఈ నెల 21 నుండి 24 వరకు గ్రామ సభల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల నాలుగు సంక్షేమ పథకాల అమలును జనవరి 26న ప్రారంభించనున్న నేపథ్యంలో ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలను షెడ్యూల్ వారీగా ఖచ్చితంగా సమయపాలన పాటిస్తూ నిర్వహించాలని, ఎక్కడ కూడా నిర్లక్ష్యాని తావు లేకుండా అధికారులందరూ అత్యంత జాగ్రత్తగా ఈ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని పేర్కొన్నారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని, గ్రామ సభలలో ఫ్లెక్సీ లు, టెంట్లు ,మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలని, మెడికల్ టీం అందుబాటులో ఉండాలని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల నోటీసు బోర్డులో అర్హుల జాబితాను ప్రచురించాలని, గ్రామ సభల్లో వచ్చే ఫిర్యాదులపై నాలుగు పథకాలకు నాలుగు రిజిస్టర్ లను ఏర్పాటు చేసి, అర్జీలను స్వీకరించాలని, గ్రామ సభలలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని, ఎక్కువ గ్రామా పంచాయతీలు ఉన్నచోట ఉదయం 9.30 నుండి 12 30 వరకు , మద్యాహ్నం 1.30 నుండి 3 30 వరకు గ్రామ సభలను ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో నిర్వహించాలని, , ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని , సమస్యాత్మక సమస్యలకు సామరస్యంగా, సానుకూలంగా సమాధానం ఇవ్వాలని, ఆదేశించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలలో లబ్దిదారుల జాబితాను గ్రామ సభల్లో చదివి వినిపించాలని, అభ్యంతరాలుంటే దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఎలాంటి అపోహలు తలెత్తకుండా ప్రజలకు స్పష్టంగా వివరించాలని, ఈ మొత్తం సంక్షేమ పథకాల రోజు వారీ ప్రక్రియను మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గ్రామ సభల తీర్మాన ప్రతులను సురక్షితంగా, ఎంతో జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ శ్రీనివాస్, డిపిఓ జయసుధ , డిఎస్ఓ మోహన్ బాబు , పి డి హౌసింగ్ కృష్ణ, వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, డి టి డి ఓ కమలాకర్ రెడ్డి, ఎ డి సర్వే ల్యాండ్ అధికారి, ఇతర జిల్లా ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమీషనర్ లు, తహసీల్దార్ లు,మండలాల ప్రత్యేక అధికారులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఈనెల 21 నుండి 24 వరకు ఇబ్రహీంపట్నం డివిజన్లో గ్రామ సభలు నిర్వహణ

**ఇబ్రహీంపట్నం, సాయి సూర్య న్యూస్ ప్రతినిధి జనవరి 20**

ఈనెల 21నుండి 24 వరకు ఇబ్రహింపట్నం డివిజన్ లోని అన్ని గ్రామపంచాయితీలలో (109) గ్రామ ప్రత్యేక అధికారుల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించబడును. ఇట్టి గ్రామ సభలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న “ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా” పథకాలు అమలులో భాగంగా పారదర్శకంగ లబ్దిదారుల ఎంపిక చేయుట గురించి చర్చించబడును. గ్రామ సభలలో మీ యొక్క సలహాలు,సూచనలు, అభ్యంతరాలు మొదలైన అంశాలపై అభిప్రాయాలను స్వీకరించడును. అంతేగాక ఈ గ్రామ సభలలో ఇంతవరకు దరఖాస్తు చేసుకొననివారు ఎవరైనా ఉన్నచో వారు కుడా తమతమ దరఖాస్తులు సమర్పించవచ్చు. కావున, ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవలసిందిగా విజ్ఞప్తి చేయుచున్నాను. అంతేగాక గ్రామ సభలలో ప్రజలు మరియు ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమానికి సహకరించి విజయవంతం చేయవలసిందిగా ఇబ్రహీంపట్నం ఆర్డిఓ విజ్ఞప్తి చేశారు

# టెక్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ కోర్సులు

-కార్పొరేట్ కమ్యూనికేషన్స్ మేనేజర్ మోహన్ దాస్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి జనవరి 20**

: విజన్ డిగ్రీ కళాశాలలో టెక్స్ అకాడమీ ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ కోర్సులను అందించడానికి బి.ఎస్.సి,బి.కాం విభాగాలకు చెందిన విద్యార్థినివిద్యార్థులను ఎంపిక చేసేందుకు ఉచిత ఆన్లైన్ స్కాలర్షిప్ పరీక్ష నిర్వహించింది. పరీక్షలో విజయం సాధించిన వారికి ఉచిత కంప్యూటర్ కోర్సులను అందించనున్నారు.అయితే ఈ సందర్భంగా ఉచిత ఆన్లైన్ పరీక్షను నిర్వహించినందుకు విజన్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ చప్పిడి శ్రీనివాస్ రెడ్డి టెక్స్ అకాడమీకి ధన్యవాదాలు తెలియ జేసారు. ఉచిత కోర్సులకు ఎంపికైనందుకు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. నెల్లూరి దానయ్య మాట్లాడుతూ ఇలాంటి ఉచిత స్కాలర్షిప్ పరీక్ష,కోర్సులు, ప్లేస్మెంట్ అందించే డ్రైవ్ల విద్యార్థుల ప్రకాశవంతమైన కెరీర్కు ఖచ్చితంగా సహాయపడతాయని అన్నారు.కార్పొరేట్ కమ్యూనికేషన్స్ మేనేజర్ మోహన్ దాస్ఉచిత స్కాలర్షిప్ పరీక్ష లో విజయం సాధించిన వారికి,
కోర్సులు పూర్తయిన తర్వాత విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తామని, టెక్స్ అకాడమీ గ్రూప్ ఆఫ్ కంపెనీల్లో ఉద్యోగులుగా ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు జీవితంలో నిరంతర కృషి తపనతో ఎన్నోవిజయాలు సాధించవచ్చన్నారు.కార్యక్రమంలో వెంకటేష్ సుధాకర్, సాగరిక, శంకర్ రెడ్డి ఫ్యాకల్టీలు అడ్మినిస్ట్రేటివ్ అధికారి విజన్ డిగ్రీ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

## గాంధీ పార్క్ శివలింగాన్ని పునప్రతిష్ఠ కి కృషి చేసిన స్థానిక కౌన్సిలర్ తాడూరి శిరీష పరమేష్

చౌటుప్పల్ జనవరి 20 చౌటుప్పల్ పట్టణ 12 వార్డ్ లో గాంధీపార్క్ ఆవరణలో గత 30 సంవత్సరాల క్రితం నిర్మించిన శివలింగం భూమి లోపలికి వెళ్లడం జరిగింది. ఆ శివలింగాన్ని పున ప్రతిష్ట చేసి పైకి ఎత్తడం కొరకు స్థానిక కౌన్సిలర్ తాడూరి శిరీష పరమేష్ ఎంతో కృషి చేశారు. వారి ఆధ్వర్యంలో శివలింగానికి గురుస్వాములు మరియు శివస్వాములు ప్రతేక పూజలు నిర్వహించి పున:ప్రారంబ పనులను నిర్వహించారు. మున్సిపల్ ప్రధమ మహిళ వెన్ రెడ్డి సంధ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం ,శివాజీ యూత్ అధ్యక్షులు గుజ్జాల్ల సురేందర్ రెడ్డి ప్రతేక పూజారి %మీాం% ప్రసాద్ గురుస్వామి మరియు పెద్ది సుధాకర్ శర్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శివమాల దీక్ష గురుస్వామిలు కుక్కల నరసింహ, ఆదిమూలం శంకర్ అభిషేకాలు నిర్వహించి పూజలు చేసారు. మరియు గ్రామ పెద్దలు శివాజీ యూత్ గౌరవ అధ్యక్షులు ఉడుగు వెంకటేష్ గౌడ్, ఉడుగు మల్లేష్, కాసుల వెంకటేశం, వరగంటి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



# కర్మభూమితో పాటు జన్మభూమికి పాటుపడండి

**ఐటి కోసం ఆనాడు పడ్డ కష్టానికి ఫలితం దక్కింది**

**సత్య నాదెళ్ల లాంటి వారు మైక్రోస్టాఫ్ట్ సిఇవో కాగలిగారు**

**కన్నవూరు కోసం పాటుపడేలా ముందుకు రండి**

**మరో జన్మంటూ ఉంటే తెలుగువాడిగా పుడతా**

**జ్యూరిచ్ పారిశ్రామికవేత్తల సదస్సులో చంద్రబాబు**

జ్యూరిచ్,జనవరి20(

కర్మభూమిని, జన్మభూమిని మరవ వద్దని ఎపి సిఎం చంద్రబాబు ప్రవాసాంధ్రులను కోరారు. తెలుగుజాతి అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. ఉన్నచోట ఉంటూనే అక్కడి దేశ అభివృద్ధితో పాటు, కన్నభూమి అభివృద్ధికి కూడా తోడ్పడాలని అన్నారు. ఏ దేశమైనా యువత వల్లే అభివృద్ధి చెందుతుందని చంద్రబాబు అన్నారు. అందుకే రాజకీయాల్లోకి వచ్చేలా యువతను ప్రోత్సహించి నట్లు చెప్పారు. రాష్ట్రానికి పెట్టుబడులు సాధించడమే లక్ష్యంగా ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్ వెళ్లిన ఆయన జ్యూరిచ్‌లో అక్కడి పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యారు. యూరప్‌లోని 12 దేశాల నుంచి వ్యాపారవేత్తలు ఈ సమావేశానికి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తాను బిల్‌గేట్స్‌ను కలవడం ద్వారా హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ వచ్చిందని, సత్యనాదెళ్ల లాంటి వారు ఇప్పుడు సిఇవో అయ్యారని చంద్రబాబు అన్నారు. తాను ఐటి గురించి మాట్లాడితే అంతా ఆశ్చర్యంగా చూశారని, కాని ఇవాళ ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు దూసుకు పోతున్నారని అన్నారు. ఎపిలో ఇప్పుడు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. 2004లో అధికారం కొనసాగివుంటే పరిస్థితి మరోలా ఉండేదన్నారు. ఎపిలో గత ఐదేళ్లలో విధ్వంసం సాగిందన్నారు. తాను విజన్ 2047తో ముందుకు వెళు తున్నానని అన్నారు. ప్రధాని మోడీ దేశం కోసం వికసిత్ భారత్‌తో కృషి చేస్తున్నారని అన్నారు. ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ తెలుగువారుంటారని, అవకాశం ఉన్న ప్రతిచోటుకీ మనవాళ్లు వెళ్లిపోతారని చెప్పారు. ‘అన్ని దేశాల్లో తెలుగువాళ్ల ఫుట్ ప్రింట్ ఉంటుంది. అదే మన గొప్పతనం. తెలుగువాళ్లు ఎక్కడైనా గొప్పగా పని చేస్తారు. రాణిస్తారు. పట్టుదల ఎక్కువ. నైపుణ్యాలు పెంచుకుంటారు. నేను జైల్లో చేసిన న్యాయ పోరాటానికి మద్దతుగా నిలిచారు. అప్పుడు ఇన్ని దేశాల్లో తెలుగువాళ్లు ఉన్నారా? అని ఆశ్చర్యపోయా. మరో జన్మ ఉంటే తెలుగువాడిగానే పుట్టించాలని దేవుడిని కోరుకుంటున్నా. యువతలో సరికొత్త ఆలోచనలు రావాలి. చైతన్యవంతులు కావాలి‘ ‘ఆ రోజుల్లో ఐటీకి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చా. అనేకమంది యువత గ్రామాల నుంచి నగరాలకు వచ్చి ఇంజినీరింగ్ విద్యను అభ్యసించి, ఐటీ రంగంలోకి వచ్చారు. హైదరాబాద్‌లో భూములు అమ్ముకోవద్దని అనేకమందికి చెప్పా. ఇక్కడి భూములకు మంచి ధర వస్తుందని ఆనాడే చెప్పా. తెలంగాణలో అత్యధిక తలసరి ఆదాయానికి హైదరాబాద్ సంపదే కారణం. చదువులో ఆడపిల్లలపై వివక్ష చూపించొద్దని ఆనాడే చెప్పాను. ఇప్పుడు ఏ ఐటీ కంపెనీకి వెళ్లినా అమ్మాయిలు కనిపిస్తున్నారు. ప్రస్తుతం యువకుల కంటే యువతులకే ఎక్కువ ఆదాయం వస్తోంది. వాస్తవానికి పురుషుల కంటే మహిళలే తెలివైన వాళ్లు. పరిశోధనలు కూడా అదే చెబుతున్నాయి‘ అని చంద్రబాబు అన్నారు. ఈ క్రమంలో అంతా జన్మభూమి కోసం కష్టపడాలని, అభివృద్ధిలో అలసి పోవద్దని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు సాధించడమే లక్ష్యంగా ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్ వెళ్లిన సీఎం చంద్రబాబు బృందం జ్యూరిచ్‌లో అక్కడి తెలుగు పారిశ్రామికవేత్తలతో భేటీ అయింది. సీఎం చంద్రబాబు ఏం చెబుతారోనని వచ్చిన వ్యాపారవేత్తలు, యూరప్ ఎన్నారై తెదేపా సభ్యులకు ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. పిలవగానే ఇంత మంది వస్తారని తాను ఊహించలేదన్నారు. ఇక్కడి తెలుగు పారిశ్రామికవేత్తలను చూస్తుంటే జ్యూరిచ్‌లో ఉన్నామా.. లేక జువ్వలపాలెంలో ఉన్నామా అర్థం కావడం లేదని హర్షం వ్యక్తం చేశారు. ‘తెలుగు జాతి సత్తా ప్రపంచానికి తెలియజేసిన వ్యక్తి చంద్రబాబు. ఆయన.. చేతిలో ఫైలు పట్టుకొని న్యూయార్క్ వీధుల్లో తిరిగారు. ఆనాడు ఆయన విజన్-2020 అంటే ఎంతో మంది ఎగతాళి చేశారు. కానీ, ఇవాళ హైదరాబాద్‌ను చూస్తే.. ఆయన ఆనాడు చెప్పిన ప్రతి మాట నిజమని నమ్మాల్సిందే. ఐటీ అభివృద్ధికి చంద్రబాబు ఎంతో కృషి చేశారు. చంద్రబాబు ఒక ఎనర్జీ. ఆయన వద్ద ఎన్నో గొప్ప ఆలోచన లుంటాయి. ఆయన జీవితం చూస్తే.. అనేక ఇబ్బందులు ఎదుర్కొని పైకి ఎదిగిన వ్యక్తిని అన్నారు.
‘కేవలం రాజకీయాలే కాదు.. వ్యాపార రంగాల్లోనూ అనుభవం ఉన్న వ్యక్తి. ఆయన మూడు సంస్థలు పెట్టి విఫలమైనా.. ఏమాత్రం అధైర్యపడకుండా పట్టుదలతో నాలుగో సంస్థ హెరిటేజ్‌ను స్థాపించారు. అనుకున్నది సాధించారు. రాజకీయాల్లో ఎన్నో ఎత్తుపల్లాలుంటాయి. ఆయన్ను అరెస్టు చేసిన సమయం నా జీవితంలో అత్యంత కష్టమైన సమయం. కానీ, ఆయన మాత్రం భయపడలేదు. ఆ సమయంలోనూ ప్రజల గురించే ఆలోచించారు. ప్రపంచం, దేశం మొత్తం ఆయన వైపు చూసే విధంగా చంద్రబాబు ఎదిగారు. పారిశ్రామికవేత్తగా, రాజకీయనేతగా అహర్నిశలూ శ్రమించారని అన్నారు. అందరూ 'ఎన్ఆర్ఐ' అంటారు. కానీ, మీరంతా 'మోస్ట్ రిలయబుల్ ఇండియన్స్'. 2019-24 వరకూ రాష్ట్రం పరువుపోతోందని అంతా బాధపడ్డారు. కలిసికట్టుగా పోరాడితేనే దుష్టశక్తులను వెళ్లగొట్టొచ్చని సమష్టిగా పనిచేశాం. మానవ వనరుల మంత్రిగా తెలుగువాళ్ల నైపుణ్యం పెంచే ప్రయత్నాలు చేస్తున్నాం. 'ఓమ్ క్యాప్' అనే సంస్థ ద్వారా మిడిల్ ఈస్ట్‌కు వెళ్లే తెలుగువారి అభ్యున్నతికి కృషి చేస్తున్నాం. సీఎం చంద్రబాబుతో కలిసి పని చేయడం మామూలు విషయం కాదు. ఇప్పుడు రాష్ట్రం కష్టాల్లో ఉంది. ఏపీ పునర్నిర్మాణం కోసం అంతా కలిసి పనిచేయాలి. మీ సహకారం, తోడ్పాటు రాష్ట్రానికి అవసరం. రానున్న ఐదేళ్లలో ఏపీ అంటే ఏమిటో ప్రపంచానికి చూపించాలనుకుంటున్నాం‘ అని మంత్రి లోకేశ్ అన్నారు.





# యానిమల్ బ్యూటీ క్లోజప్ అందాలు

తాజాగా మరోసారి ఈ అమ్మడు తన అందమైన ఫోటోలను షేర్ చేసింది. త్రిప్తి డిమ్రీ సినిమా ఇండస్ట్రీలో నటిగా అడుగు పెట్టి చాలా కాలం అయినా దక్కని గుర్తింపు 'యానిమల్' సినిమాతో దక్కింది. ఓవర్ నైట్ స్టార్ హీరోయిన్‌గా పేరు దక్కించుకుంది. యానిమల్ సినిమాలో రణబీర్ కపూర్‌తో చేసిన సన్నివేశాల కారణంగా త్రిప్తి డిమ్రీకి ఒక్కసారిగా గుర్తింపు లభించింది. యానిమల్‌లో హీరోయిన్‌గా నటించిన రష్మిక మందన్న కంటే ఎక్కువగా త్రిప్తి గురించి మీడియాలో చర్చ జరిగింది. ప్రేక్షకులు సైతం త్రిప్తి గురించి మాట్లాడుకున్నారు. అందుకే యానిమల్ విడుదల అయిన వెంటనే బాలీవుడ్‌లో బ్యాక్ టు బ్యాక్ నాలుగు ఐదు సినిమాల్లో నటించే అవకాశాలు దక్కిన విషయం తెల్సిందే. ఇప్పటికే బాలీవుడ్‌లో త్రిప్తి నటించిన సినిమాలు బ్యాక్ టుబ్యాక్ ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. యానిమల్ ఇచ్చిన క్రేజ్‌తో గత ఏడాది మూడు సినిమాలతో త్రిప్తి ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రస్తుతం ఈ అమ్మడు రెండు మూడు సినిమాలు చేస్తోంది. అవి మాత్రమే కాకుండా మరికొన్ని సినిమాలు షూటింగ్ దశలో ఉన్నాయి. మొత్తంగా త్రిప్తి జోరు మామూలుగా లేదు. ఓ రేంజ్‌లో ఈ అమ్మడు సినిమాలతో దూసుకు పోతుంది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం, అంతే కాకుండా నటనతో మెప్పించేంత ప్రతిభ ఈ అమ్మడికి ఉంది. అందుకే బిజీ బిజీగా సినిమాలు చేస్తుంది. సినిమాలతో వచ్చిన క్రేజ్ కారణంగా సోషల్ మీడియాలో ఈ అమ్మడి ఫాలోయింగ్ విపరీతంగా పెరిగింది. సోషల్ మీడియాలో తన ఫాలోవర్స్ కోసం ముద్దుగుమ్మ త్రిప్తి అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం మనం చూస్తూనే ఉన్నాం. తాజాగా మరోసారి ఈ అమ్మడు తన అందమైన ఫోటోలను షేర్ చేసింది. ఎక్కువ ఎబ్బెట్టుగా లేకుండా చాలా అందంగా కనిపించే విధంగా త్రిప్తి ఫోటోలకు ఫోజ్‌లు ఇస్తుందని అంటారు. బాలీవుడ్‌లో చాలా మంది హీరోయిన్స్‌తో పోల్చితే త్రిప్తి చాలా అందంగా ఉంటుందని, నటనతోనూ వారికంటే బెటర్‌గా మెప్పిస్తుంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. తాజాగా క్లీ వేజ్ షో చేస్తూ క్లోజప్‌లో నడుము అందాన్ని చూపించిన ఈ అమ్మడి ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆకట్టుకునే విధంగా ఉన్న ఈ ఫోటోలు త్రిప్తి డిమ్రీ గురించి సోషల్ మీడియాలో మరింత ఎక్కువగా చర్చ జరిగేలా చేస్తుంది. ఇంత అందం ఉండి ఇన్నాళ్లు కనిపించకుండా ఎలా ఉందంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. యానిమల్ సినిమాలో ఈమెని దర్శకుడు చూపించింది కొంచెమే అని, సోషల్ మీడియాలో షేర్ చేస్తున్న ఫోటోలను చూస్తూ ఉంటే మరింత అందంగా ఉందని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి యానిమల్ తో బ్రేక్ దక్కించుకున్న ఈ అమ్మడు తెలుగు సినిమాల్లో ఎప్పుడు నటిస్తుందో చూడాలి

# బులుగు బ్రాలో యంగ్ బ్యూటీ కవ్వింత

ఇటీవల స్పాట్ లైట్ అనే వెబ్ సిరీస్ లో త్రిధా అందాలు ఆరబోసిన తీరు చర్చగా మారింది. క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ తో కిల్ చేయడంలో త్రిధా చౌదరి తర్వాతే! త్రిషకు మోడ్రన్ వెర్షన్ లా కవ్విస్తుంది ఈ బ్యూటీ. టాలీవుడ్ యంగ్ హీరోల సరసన వరుసగా అవకాశాలు అందుకుంది. 'సూర్య వర్సెస్ సూర్య' చిత్రంలో నిఖిల్ సరసన నటించిన ఈ భామ ఆ తర్వాత 'మనసుకు నచ్చింది' అనే చిత్రంలోనూ నటించింది. సెవెన్, అనుకున్నదొక్కటి అయినదొక్కటి చిత్రాల్లోను నటించింది. జయాపజయాలకు అతీతంగా నేటితరం హీరోలకు త్రిధా మంచి ఆప్షన్. ఇటీవల స్పాట్ లైట్ అనే వెబ్ సిరీస్ లో త్రిధా అందాలు ఆరబోసిన తీరు చర్చగా మారింది. వెబ్ సిరీస్ ఆద్యంతం వేడెక్కించే లిప్ లాక్ లతో గుబులు పెంచింది. ఆ తర్వాత బాలీవుడ్ లో 'షంషేరా'లాంటి భారీ చిత్రంలోనూ నటించింది. కానీ ఇవేవీ తన ఫేట్ ని మార్చలేకపోయాయి. వీటన్నిటినీ మించి త్రిధా పట్టుదల ఆశ్చర్యపరుస్తోంది. సోషల్ మీడియాల్లో ఈ భామ జరంత స్పీడ్ కనబరుస్తోంది. ఇన్ స్టాలో నిరంతరం వేడెక్కించే ఫోటోషూట్లతో తన ఫాలోవర్స్ ని యంగేజ్ చేస్తోంది. తాజాగా త్రిధా షేర్ చేసిన కొత్త ఫోటోగ్రాఫ్ గుండెల్లో గుబులు పెంచుతోంది. ఈ ఫోటోగ్రాఫ్ లో త్రిధా బ్లూ అండ్ బ్లూ లుక్ లో కనిపించింది. శరీరాన్ని అతుక్కుపోయే బ్లూ టాప్ ని ధరించి, టైట్ ట్రాక్ లో హీట్ పెంచింది త్రిధా. త్రిధా ఫోటోషూట్ ఇప్పుడు యూత్‌లో హాట్ టాపిక్ గా మారింది. క్యూట్ బ్యూటీ సో హాలి అంటూ ఫ్యాన్స్ ఘాటైన కామెంట్లు చేస్తున్నారు. త్రిధా అందచందాలకు ముగ్ధులవుతున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్ ని వాట్సాపుల్లోను జోరుగా వైరల్ చేస్తున్నారు. అంటే.. దానికి తన నుంచే సరైన సమాధానం రావాల్సి ఉంది. ఇటీవల బెంగాలీ చిత్రం 'బూమరాంగ్'లో కనిపించింది. తదుపరి దక్షిణాదిన మరిన్ని కథలు వింటోందని సమాచారం. ఈ బ్యూటీ టాలీవుడ్ లో బౌన్స్ బ్యాక్ అయ్యేందుకు దర్శకనిర్మాతలను సంప్రదిస్తోందని సమాచారం. కథలు వింటూ, సరైన అవకాశం కోసం ప్రస్తుతం వేచి చూస్తోంది. తెలుగులో తదుపరి చిత్రాన్ని ప్రకటించడానికి కొంత సమయం పట్టొచ్చని చెబుతున్నారు






# గోల్డెన్ డిలైట్‌లో అషు రెడ్డి మెరుపులు

సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడూ కొత్త లుక్‌లతో మెరిసిపోతున్న ఆషు రెడ్డి తన అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడూ కొత్త లుక్‌లతో మెరిసిపోతున్న ఆషు రెడ్డి తన అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో గ్లామర్ పిక్స్ షేర్ చేయడంలో ముందుండే ఆషు, ఇప్పుడు తన లేటెస్ట్ ఫోటోషూట్‌తో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. "గోల్డెన్ డిలైట్" క్యాప్షన్‌తో షేర్ చేసిన ఈ ఫోటోలో ఆమె వేసిన అద్భుతమైన గోల్డెన్ ప్రింటెడ్ బాడీ ఫిట్ డ్రెస్, దీనికి జతగా ధరించిన స్టైలిష్ డెనిమ్ జాకెట్ ఆమెకు మరింత గ్లామర్ ని తీసుకువచ్చింది. ఆమె వైభవంగా మెరిసే హావభావాలు, ఆడిట్యూడ్ నెటిజన్ల మనసులను బాగా ఆకట్టుకున్నాయి. ఆషు రెడ్డి గతంలో జూనియర్ సమంతగా గుర్తింపు తెచ్చుకుని, తనకంటూ ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్‌ను సొంతం చేసుకుంది. అయితే, ఇటీవల ఆమె ఈ ఇమేజ్‌కు దూరంగా వెళ్లి తనకంటూ ప్రత్యేకమైన స్టైల్ స్టేట్మెంట్‌ను క్రియేట్ చేసుకుంటోంది. ఈ ట్రాన్సిషన్‌లో ఆమె లుక్, ప్రెజెన్స్ మరింత ఇంప్రెసివ్‌గా మారాయి. "హ్యాపీ సోల్స్ ఆర్ ద ప్రెట్టియెస్ట్" అనే క్యాప్షన్ కూడా ఆమె కాన్ఫిడెన్స్‌ను ప్రతిబింబిస్తోంది. ఫిట్‌నెస్ మీద దృష్టి పెట్టిన తర్వాత ఆమె గ్లామర్ లుక్ మరింత అందంగా మారింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ తాజా ఫోటోలు అభిమానులకు మాత్రమే కాకుండా, నెటిజన్లకు కూడా ఫుల్ టాక్ ఆఫ్ ద టౌన్ అయ్యాయి. ఆషు రెడ్డి ధరించిన గోల్డెన్ ప్రింటెడ్ డ్రస్ ఆమె అందాన్ని హైలైట్ చేస్తూ ప్రత్యేకమైన లుక్ ఇస్తోంది. ఆమె తన లుక్‌తోనే కాకుండా ఫోటోకి ఇచ్చిన క్యాప్షన్‌తో కూడా ప్రత్యేకమైన మెసేజ్‌ని అందించింది. నేనే ఒక స్టైల్ అంటూ గతంలో చెప్పినట్లు, ఈ లుక్ ఆమె వ్యక్తిత్వానికి, ఆత్మవిశ్వాసానికి తార్కాణంగా నిలిచింది. ఆషు రెడ్డి సోషల్ మీడియాలో తన ఫాలోవర్స్‌ను కేవలం గ్లామర్ షోతోనే కాదు, కాన్ఫిడెంట్ లుక్‌లు, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ద్వారా కూడా అట్రాక్ట్ చేస్తోంది. ఈ ఫోటోల్లో ఆమె వేసుకున్న డ్రస్ ఫ్యాషన్‌కి హై గ్లామర్ టచ్‌తో మోడ్రన్ ట్రెండ్‌ని మిళితం చేసినట్లు కనిపిస్తోంది. ఇలాంటి యూనిక్ లుక్‌లు ఆమెను సోషల్ మీడియాలో మరింత ప్రత్యేకంగా నిలిపాయి.

# బ్లాక్‌లో మెరిసిన ఎన్టీఆర్-నీల్ హీరోయిన్

ఆకట్టుకునే అందంతో పాటు బ్లాక్ ఔట్ ఫిట్‌లో ఈమె అందానికి ఫిదా అవుతున్నారు. బ్లాక్ డ్రెస్ ఈమెకి బాగా సెట్ అయ్యింది. 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' సినిమాలో నిఖిల్‌కు జోడీగా నటించిన ముద్దుగుమ్మ రుక్మిణి వసంత్. ఈ మధ్య కాలంలో టాలీవుడ్ లో ఈ అమ్మడికి పెద్ద సినిమాలు ఏమీ పడలేదు. కానీ కన్నడంలో మాత్రం ఈ అమ్మడు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా వరుస సినిమాలు చేస్తూ వస్తోంది. ముఖ్యంగా ఈ అమ్మడు చేసిన సప్త సాగరాలు దాటి సినిమా రెండు పార్ట్‌లకు మంచి స్పందన దక్కింది. ఆ సినిమా రెండు భాగాలను తెలుగు ప్రేక్షకులు చూసి ఆదరించారు. అందుకే తెలుగులో ఈ అమ్మడు డైరెక్ట్ సినిమా మళ్లీ ఎప్పుడు చేస్తుందా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు తెలుగులో ఈ అమ్మడు ఎన్టీఆర్‌కి జోడీగా నటించబోతుంది. సప్త సాగరాలు దాటి సినిమాలో నటనతో మెప్పించిన ఈ అమ్మడు అందంతోనూ ఆకట్టుకుంటూ ఉంది. సింపుల్ అండ్ స్వీట్ లుక్‌లోనే కాకుండా స్కిన్ షోతోనూ ఈ అమ్మడు ఆకట్టుకుంది. పలు సార్లు సోషల్ మీడియా ద్వారా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేసిన ఈ అమ్మడు ఈసారి సింపుల్ అండ్ స్వీట్ అనిపించే విధంగా బ్లాక్ ఔట్ ఫిట్‌లో సందడి చేసింది. ఆకట్టుకునే అందంతో పాటు బ్లాక్ ఔట్ ఫిట్‌లో ఈమె అందానికి ఫిదా అవుతున్నారు. బ్లాక్ డ్రెస్ ఈమెకి బాగా సెట్ అయ్యింది. గతంలో షేర్ చేసిన ఫోటోలతో పోల్చితే ఈ ఫోటోలు మరింత ఆకర్షణీయంగా ఉన్నాయంటున్నారు. ఎన్టీఆర్‌తో ఈమె నటించబోతుంది అంటూ నందమూరి ఫ్యాన్స్ ఈ పోటోలను తెగ షేర్ చేస్తున్నారు. దర్శకుడు ప్రశాంత్ నీల్ ఇటీవలే ఎన్టీఆర్‌తో సినిమాకు సంబంధించిన షూటింగ్ ప్రారంభించాడని, ఈ నెల చివరి వారంలో ఎన్టీఆర్ సైతం షూటింగ్‌లో జాయిన్ కాబోతున్నాడు అంటూ వార్తలు వస్తున్నాయి. ఆ విషయమై మరింత క్లారిటీ రావాల్సి ఉంది. అంతే కాకుండా ఎన్టీఆర్ కి జోడీగా రుక్మిణి వసంత్ నటిస్తున్నట్లుగా వస్తున్న వార్తల విషయంలో ఇప్పటి వరకు అటు నుంచి కానీ, ఇటు నుంచి కానీ ఎలాంటి స్పందన రాలేదు. త్వరలోనే ఆ విషయమై అధికారికంగా ప్రకటన వస్తుందేమో చూడాలి. రుక్మిణి ఆర్మీ స్కూల్‌లో చదువుకుంది. ఎయిర్ ఫోర్స్‌లో ట్రైనింగ్ చేసింది. లండన్‌లోని బ్లూమ్స్‌బరీలోని రాయల్ అకాడమీలో నటనలో పట్టా పొందింది. యాక్టింగ్ విషయంలో విమర్శకుల ప్రశంసలు దక్కించుకున్న రుక్మిణి వసంత్ కచ్చితంగా ఎన్టీఆర్‌కి జోడీగా నటించడం ద్వారా సినిమాకు ఆర్షణగా నిలుస్తుందని అంతా భావిస్తున్నారు. వచ్చే ఏడాదిలో ఎన్టీఆర్‌తో కలిసి ఈ అమ్మడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందబోతున్న సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎన్టీఆర్‌తో సినిమా తర్వాత పాన్ ఇండియా స్థాయిలో ఈ అమ్మడు బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి



Printed Published and owned by Polagoni Rajesh Printed at PMRPublications, Ranga Reddy (Dist), Telangana 50150. at H.No 4-136/12,Journalist colony, Turkayamjal,Ranga Reddy District, Telangana-501510 Editor: Polagoni Rajesh. www.sai suryaadaily.com